ఆగస్టు - 2024

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,


**చందా వివరాలు :**
సంవత్సర చందా రూ. **350/-**
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-

**చిరునామా :**
ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లోపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726

**బ్యాంకు అకౌంటు వివరాలు :**
A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890

## విషయసూచిక

| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జష్పత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| హ్యాపీడేస్ | కె.ఇ. రాజేంద్ర | 08 |
| యేసు పాదసన్నిధి | డా॥ సుష్మ, నెల్లూరు | 09 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 10 |
| విజయసారథి | సాక్ష్యము | 11 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 14 |
| క్రొత్తకోణాలు | అద్దంకి జాన్‌వెస్లీ | 15 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| హన్నా | స్త్రీల కొరకు | 20 |
| నిజస్నేహితుడు | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ క్విజ్-08 | | 24 |




సీరియల్ నంబరు

సంపాదకీయం....

# స్వేచ్ఛ

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

అందరికి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. ఈ నెల అంతా స్కూల్స్, కాలేజీలు, అన్ని ప్రభుత్వ సంస్థలలోను స్వాతంత్ర దినోత్సవ సంబరాలను గూర్చే మాట్లాడుకుంటుంటారు. స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడానికి ముఖ్య కారణం మనం స్వేచ్ఛను పొందడం. అయితే వాస్తవంలో స్వేచ్ఛ అంటే ఏంటో అందరి కంటే ఎక్కువగా క్రైస్తవునికి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉన్నది.

సాధారణంగా స్వేచ్ఛ అంటే చేయాలి అనుకున్నది, ఇష్టపడింది చేయడం అని అనుకుంటారు కానీ వాస్తవానికి స్వేచ్ఛ అంటే చేయాలి అనుకున్నది చేయడం మాత్రమే కాదు, చేయకూడదు అనుకున్నది చేయకుండ ఉండటం కూడా స్వేచ్ఛే. నిజానికి అదే స్వేచ్ఛ. ఈ మధ్య తరచుగా వినపడే పదాలలో డిప్రెషన్ ఒకటి. దీనికి కారణం కూడా మనం అనుకున్నది చేయలేకపోవడం, లేదా ఇష్టం లేనిది బలవంతంగా చేయడం వలన కలిగే మానసిక ఒత్తిడి. మనం పరాయి వాడి అధికారంలో ఉంటే బానిసత్వం. బానిసత్వంలో మనం చేయాలి అనుకున్నది చేయడానికి, వద్దు అన్నకున్నది చేయకుండా ఉండటానికి మన మీద మనకు ఎటువంటి అధికారం ఉండదు. అయితే ఇప్పుడు ఇన్నేళ్ళ స్వతంత్రతావనిలో నీ (ఆలోచనల) మీద నీవు పూర్తి అధికారం కలిగి ఉన్నవా?

మన దైనందిన జీవితం ఎలా ఉన్నది? ఆదివారం సంఘంలో దేవుని వాక్యం వినినప్పుడు ఉండే తీవ్రత, తీసుకునే నిర్ణయాలు ఆదివారం అనంతరం అమలు చేయగలుగుతున్నామా? నీవు అనుకున్నది నీవు చేయలేకపోతే నీవు స్వతంత్రుడవు/స్వతంత్రురాలివి కానట్టే కదా! ఆలోచించుము! ఒక క్రైస్తవునిగా నీవు చేయు పనులు, నీ ఆలోచనలు స్వీయనియంత్రణలో ఉన్నవా? లేకుంటే నీవింకా బాని(దా)సత్వములోనే ఉన్నట్టే అని గ్రహించుము.

"పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" యోహాను 8:34 పాపము అనగా ఆజ్ఞాతిక్రమము, దేవుని మాటను మీరుట, దేవుడు ఆశించినట్లుకాక ఆయనకు వ్యతిరేకముగా (తలంపులలో కూడ) జీవించుట. మన ఆలోచనలలో నిరంతరం ఉండవలసిన అంశం దేవుడు, దేవుని వాక్యం. అప్పుడు మత్రమే మనం ఆయనను తెలసుకుంటాం. అప్పుడే స్వతంత్రులమౌతం. మన ఆలోచనలపై, పనులపై మనకు నియంత్రణ వస్తుంది తద్వారా నిజమైన మానసిక ఆనందాన్ని, స్వేచ్ఛని పొందుతాం!

" మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" యోహాను 8:31,32

-కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర

K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole
**A/c No. 1095729434O**

సీరియల్

# జప్నత్పనేహు

**(యోసేపు జీవిత చరిత్ర)**

**- కొడవటికంటి**

అందుకు థేమాను “ఐగుప్తు ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ ప్రాచీనమైనది. బబులోను పట్టణము కట్టబడకముందే ఐగుప్తు కట్టబడింది. వీరి భాషకు లిపి కనుగొన్నప్పుడు, ప్రపంచంలో ఏ భాషకును లిపి కనుగొనబడలేదు. అందువలన ఐగుప్తులో గణితశాస్త్రము వృద్ధి చెందినది. ఇప్పుడు ఈ దేశములో నైలునదికి తూర్పున జనసామర్ధ్యము కలిగిన పట్టణాలు వుంటే, పడమర తట్టున మృతులైన వారి సమాధులు, పిరమిడ్లు, ఫెనిక్స్ ఇవన్నీ ప్రపంచంలో ఏ దేశాలు కలిగియుండలేదు. ఇకముందు కూడా ఎవరూ నిర్మించలేరు. ఇది యధార్థం. మన సృష్టిలో ఏవైనా కాలమునకు భయపడతాయి. కాని ఈ పిరమిడ్లను చూసి కాలమే భయపడుతుంది. కాలానికి ఈ పిరమిడ్లను నాశనంచేసే శక్తి లేదు. ఏదో ఒకరోజున కాలము గతించిపోయిన తర్వాతనే పిరమిడ్లు నాశనం కాగలవేమో!” అన్నాడు థేమాను.

“ఈ పిరమిడ్లను ఎవరు నిర్మించారు?” అడిగాడు యోసేపు. ఎంతోకాలం నుండి ఈ ప్రశ్న తన మనసులో మెదలుతుంది. పిరమిడ్లు వెనుక సూర్యుడు కృంగి పోయేటప్పుడు తనకు తెలియకుండానే ఒక రకమైన భయం వేసింది. ఒక కొండ వెనక్కి సూర్యుడు కృంగటం వేరు. కానీ సూర్యుడు ఒక పిరమిడ్ వెనక మాయమై పోవటం, చూసిన వారికే అర్ధమవుతుంది. అసలు పిరమిడ్ గురించి చిన్నప్పటి నుండి ఎందరో ఎన్నో చెప్తుంటే విన్నాడు. కానీ ఇప్పుడు దగ్గర నుండి చూసిన తర్వాత పిరమిడ్ గురించిన తన యోచన ఎంత అల్పమైనది! అని నవ్వు వచ్చింది.

థేమాను నిట్టూర్పు విడిచాడు. “అసలు పిరమిడ్లు నిర్మించింది ఎవరు? ఎంతకాలం క్రితం నిర్మించారు? ఎందుకొరకు నిర్మించారు? ఎలా నిర్మించారు? అనే విషయాలలో ఏ ఒక్కదానికైనా జవాబు చెప్పగలిగితే ఈ పాటికి ఇప్పటి మానవులు కనీసం ఈ పిరమిడ్‌లలో అత్యల్పమైన ఒకదానినైనా నిర్మించటానికి ప్రయత్నించే వారే. అసలు పిరమిడ్‌ని చూసిన వెంటనే మనిషిలో మొదట వచ్చే భావన ఏమిటంటే, వీటిని మానవులెవరూ కట్టలేరు. ఇవి మానవ నిర్మితాలు కావు అనే భావన” అన్నాడు థేమాను.

“అంటే మా తాత అబ్రాహాముగారు ఈ దేశమునకు రెండువందల సంవత్సరాల క్రితం వచ్చినప్పుడు వీటిని చూసి వుంటారన్న మాట” అన్నాడు నవ్వుతూ యోసేపు.

“మీ తాతగారు చూసిన ఈ పిరమిడ్‌ని రెండువందల సంవత్సరాల తర్వాత నువ్వు చూస్తున్నావు. నీ తర్వాత రెండువందల సంవత్సరాలకు నీ మునిమనమండ్లు చూస్తారు. ఒకవేళ నీ దేవుడు ఈ లోకంలో జన్మమెత్తి ఏదో ఒకరోజు ఈ దేశం వచ్చి, కొంతకాలం నివసించి ఈ పిరమిడ్లు చూసి వెళ్తారు. ఈ పిరమిడ్లని హనోకు అనే ఆయన నిర్మించాడు అని కొందరంటున్నారు” అని చెప్పాడు థేమాను.

వెంటనే యోసేపు “హనోకు అంటే, మా పితరుడైన అబ్రాహామునకు ముందు 1946 సంవత్సరాల క్రితం జీవించాడు. కాని అతను దేవునితో నడచిన తర్వాత దేవుడతనిని తీసుకొనిపోయెను అని అంటారు ఆ... హనోకేనా?” అని అడిగాడు యోసేపు.

“ఏమో! అతనో కాదో తెలియదు కాని, ఈ పిరమిడ్లు కట్టించిన అతను మూడు వందల అరవైఐదు సంవత్సరాలు జీవించి తర్వాత కనబడకుండా పోయాడు. మరికొంత మంది ఈ పిరమిడ్‌లను కట్టించినది ఆయన కాదు. మెల్కీసెదెకు అని, ఆయన షాలేమురాజు అని భావిస్తారు. అయితే ఇప్పుడు ఆ దేశము ఎక్కడ ఉందో? అతని తల్లిదండ్రులు ఎవరో, ఎంతకాలం నుండి ఎంతకాలం వరకు అతను జీవించాడో తెలియదు” అన్నాడు థేమాను.

“మా తాతగారి తండ్రి అబ్రాహాముగారు ఒకసారి

బబులోను రాజు అమ్రాపేలుతో యుద్ధంచేసి, ఓడించి, తిరిగి కనానుదేశం వస్తుంటే, మెల్కీసెదెకు అనే ఆయన సర్వోన్నతుడైన దేవుని యాజకునిగా వచ్చి, అతనిని దీవించి అతని యొద్ద నుండి అన్నిటిలోను దశమ భాగము తీసుకున్నాడు" అన్నాడు యోసేపు.

అందుకు థేమాను "అవన్నీ ఒక ఎత్తు. ఇప్పుడున్న పిరమిడ్‌లన్నింటిలోను మనకు ఎత్తుగా కనబడే పెద్ద పిరమిడ్ పేరు చియోప్స్ దీనిని చియోప్స్ అనే అతను లక్షమంది బానిసలతో ఇరవై సంవత్సరాలు కట్టాడని అంటారు. లక్షమంది బానిసలతో ఇరవై సంవత్సరాలు కట్టిన పిరమిడ్ రాళ్ళు దాదాపు ఆరు ఫర్లాంగులు దూరం నుండి లాక్కోని రావటానికి కావల్సిన అరవై అడుగుల రాతిబాట పది సంవత్సరాల కాలంపాటు లక్షమంది బానిసలు నిర్మించారు. ఈ బాట నిర్మాణం అంతా మెరుగు చేయబడిన రాళ్ళతోనే. పది సంవత్సరాలు లక్షమంది బానిసలు ఈ బాటను వేశారు. తర్వాత లక్షమంది బానిసలు ఈ బాటమీద ఈడ్చుకొని రాబడిన పెద్దపెద్ద రాళ్ళతో 20 సంవత్సరాలు ఈ పిరమిడ్‌ని నిర్మించారు" అన్నాడు థేమాను అలసి పోయినవాడిలా.

"కేవలం తన సమాధి కొరకు ఇంత ఖర్చు పెట్టాడా? ఆనాటి ఫరో" అడిగాడు యోసేపు. "చిన్న పిరమిడ్లన్నీ సమాధులే కానీ ఈ పెద్ద పిరమిడ్ అదే చియోప్స్ అనేది మాత్రం సమాధి కాదు" అన్నాడు థేమాను.

"అదెట్లా?" అడిగాడు యోసేపు ఆసక్తిగా.

"ఈ పెద్ద పిరమిడ్‌ని చాలా పెద్ద రాళ్ళతో కట్టారు. ఎంత పెద్ద రాళ్ళంటే ఒక్కరాతిని రెండువందల మంది బలమైన మనుష్యులు పైకి ఎత్తాలని ప్రయత్నిస్తే ఒక అంగుళంలో ఎనిమిదవ వంతు మాత్రం పైకి ఎత్తగలరు. దీని పునాది పద్నాలుగు ఎకరాల వైశాల్యం. అయితే మొత్తం పిరమిడ్ కట్టబడిన అడుగు భాగము పదమూడు అడుగులు నిచ్చెన మెట్లులాగ పేర్చిన ఈ పెద్ద రాళ్ళు మొదటి వరసలో రాళ్ళు నాలుగు అడుగుల పొడవు, మూడు అడుగుల వెడల్పు. రెండవ వరసలోని రాళ్ళు మూడు అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పు. ఈ విధంగా పదమూడవ వరస పూర్తయిన తర్వాత పిరమిడ్ లోపలున్న రాజుగారి, రాణిగారి గదులలోకి దారి ఏర్పడుతుంది. అంతేకాదు ఈ పిరమిడ్ యొక్క నాలుగు మూలలు భూమి యొక్క నాలుగు మూలలకు సమానంగా కట్టారు. ఇది భూమి యొక్క పదమూడవ అక్షాంశము మీద కట్టబడింది.

అంటే ఈ పిరమిడ్ కట్టిన వారికి భూగోళశాస్త్రము, ఆకర్షణశక్తి గురించి భూమి యొక్క గరిమనాభి పీఠము ఎక్కడ ఉన్నదో తెలుసునన్న మాట. దీని ఎత్తు ఐదువందల అడుగులు. ఒక రహస్యం ఉంది. ఏమిటంటే, నాలుగు పలకలుగా కట్టబడి ఒక ప్రక్క నేల ఆనిన భాగము (365) మూడువందల అరవై అయిదు అడుగుల కొన్ని డిగ్రీలు" అన్నాడు థేమాను.

యోసేపు ఆశ్చర్యపోయి "థేమాను.. ఆగు.. ఆగు... ఏంటన్నావ్? మూడువందల అరవై ఐదు అడుగుల కొన్ని డిగ్రీలా? అంటే భూమి సూర్యుని చుట్టూ తిరిగే రోజుల కొలత కదా? సంవత్సరానికి మూడు వందల అరవై అయిదు దినముల మీద కొన్ని గంటలు సూర్యుని చుట్టూ ఈ భూమి తిరుగుతుంది కదా! పిరమిడ్ కొలతలకు భూమికి సంబంధం ఉన్నట్టుంది కదూ!"

"ఔను, ఈ పిరమిడ్ కట్టబడిన రాళ్ళు ఏదో ఒక ప్రవచనం చెప్తుంది అంటారు. అంటే దేవుడు మానవుని జన్మ అవతరిస్తాడని తర్వాత మరలా రెండవసారి వస్తాడని అప్పటి వరకు తాను ఇలాగే భూమి మీద పడిపోకుండా ఉండిపోగలనని చెప్తుంది. దీని ముఖ్యమైన మూలరాయి పునాదిలో వేయబడక, శిరస్సున వేయబడింది. అందువల్ల దీని కట్టుబడి, క్రింద నుండి కాక మధ్య నుండి పైకి మెట్లులాగా కట్టి తర్వాత నాలుగు ప్రక్కలా కట్టియుంటారని. అయినా ఇంత పెద్దరాళ్ళు ఐదువందల అడుగుల ఎత్తుకు ఎలా తేగలిగినారో ఇప్పటికీ శాస్త్రజ్ఞులకు కూడా అర్థం కావటం లేదు" అని చెప్పాడు థేమాను.

"థేమాను! ఆ పిరమిడ్ లోపలికి దారి వుందన్నావు. రాజుగారి గది, రాణిగారి గది ఎలా ఉంటాయి? నువ్వు చూసావా?" అడిగాడు యోసేపు.

"ఈ పిరమిడ్‌ల లోపలికి ప్రవేశించింది నేను కాదు. కాని నా కంటే ముందుగానే అనేకులు వీటియొక్క ద్వారములు కనుగొనడానికి అనేక శాస్త్రములు ఉపయోగించారు. ఈ పిరమిడ్ పూర్తయి అందులోనికి చేర్చవలసిన శవపేటికలు, చనిపోయిన వారి కొరకైన రథాలు, గుర్రాలు, ఆహారం, కాగితాలు, అలంకరణ సామానులు, ధనము, బంగారము, నగలు చేర్చిన తర్వాత అవి లోపల నుండి మూసివేయబడతాయి. కనుక బయటి వారికి వాటిని తెరవడం చేతకాదు. ఎందుకంటే ఈ రహస్యాలు తెలిసినవారు పూజారులు మాత్రమే. ఐగుప్తు రాజులు పూజారులను ప్రేమిస్తారు, గౌరవిస్తారు. ఎందుకంటే అనేకమంది పూజారులు, రాజుల శవపేటిక సామానులతో పాటు వారు కూడా లోనికి వెళ్ళి లోపలి తట్టు నుండి పిరమిడ్ ద్వారం మూసివేసి కొన్ని రోజులకు అక్కడే చనిపోతారు. అందువలన బయట వారికి అది తెరవటం చేత కాదు.

పూజారులు చాలా విశ్వాసపాత్రులు, జ్ఞానులు. వారి పిల్లలను పూజారులకు ఇచ్చి పెండ్లి చేస్తారు. రాజవంశము మలినము కాదని వారి బిడ్డలకు పూజారుల బిడ్డలనిచ్చి పెండ్లిచేస్తారు" అని థేమాను అంటుంటే క్షణంసేపు యోసేపు మనస్సులో ఆసెనతు మెదిలింది. నిట్టూర్చి సరిగా కూర్చున్నాడు. యోసేపు తను చెప్పేది ఇప్పుడు వినటం లేదని, ఏదో ఆలోచనలో ఉన్నాడని థేమాను తెల్సుకొని చెప్పటం ఆపేసినా యోసేపు మనస్సు ఇంకా చెరసాల లోనికి రాలేదు.

ఔను నిజమే! పూజారి కుమార్తె ఎంత జ్ఞానవంతురాలు. తనతో ఎక్కువ పరిచయం లేనప్పటికిని తన యజమానురాలి ప్రవర్తన అంతా తన తండ్రి ఇంట్లోనే ఆసెనతు కనిపెట్టగలిగింది. నిజంగా తన విషయం ఆమె అలా ఎందుకు జాలిపడింది? తనని చూసినప్పటి నుండి తన విషయం ఎందుకు ఆరా తీసింది? నైలునది ఒడ్డున తన దీనస్థితిని చూసి ఎందుకు ఏడ్చింది? తను ఆ రోజున ఉన్న స్థితిలో ఆసెనతు యొక్క కళ్ళు మాట్లాడిన భాష తను గమనించలేదు. కానీ ఇప్పుడు ఈ నిశ్చలమైన స్థితిలో ఆసెనతు జ్ఞాపకమే ఎంతో మధురంగా ఉంది. ఆసెనతు తన యజమానురాలి కంటే అందగత్తేమి కాదు. కాని ఆసెనతు జ్ఞానము, ఆమె కళ్ళలో నుండి బయటకు వచ్చే కిరణాలు, శత్రువులను దహించి వేయగలిగినవి. తనలాంటి హెబ్రీయునికి వెలుగు ఇవ్వగలిగింది. ఆసెనతు ఏడుస్తున్నప్పుడు తన మీద రాలిపడిన కన్నీటి బిందువులకు కృతజ్ఞతగా ఆమె పాదాల వద్ద కూర్చొని ఆమె ముఖం చూడాలనిపిస్తుంది. ఇప్పుడే మళ్ళీ పరుగెత్తుకుంటు వెళ్ళి నైలునది ఒడ్డున కూర్చుంటే అప్పుడు ఆసెనతు వస్తే, ఆమె నడచిన పాదాల క్రింద నైలునది ఇసుక కొంత తను ఈ చెరసాలలలో దాచుకుంటే? ఆమె తనకి ఏమి అవుతుంది? దేవత మానవులందరికి పూజార్పురాలు. తన ఒక్కడికేనా, కాదు. ఆమె ఈ ఐగుప్తుకి దేవత. ఈ చెరసాలలో చనిపోయేటంత వరకు ఆమెని హృదయంలో నిలుపుకుంటే కాదనగలిగిన వారెవరు? **(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు

22

(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

"నా యేలినవాడా.... రాజా..." అని పెద్దగా అరిచాడు. ఆ అరుపుకు గుహలో నుండి ప్రతి ధ్వని వచ్చింది. నడుస్తున్న సౌలు తక్కున ఆగిపోయాడు. వెనక్కి తిరిగి చూచాడు. తాను ఇప్పుడు ఏ గుహలో నుండి వచ్చాడో ఆ గుహ పైభాగమున దావీదు నిలుచుని ఉన్నాడు. గుండె ఒక్క క్షణం ఆగినట్లు అనిపించింది. సౌలు దావీదును చూచినప్పుడు దావీదు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాడు.

"దావీదు నీకు కీడు చేయనుద్దేశించుచున్నాడని జనులు చెప్పిన మాటలు నీవెందుకు వినుచున్నావు? ఆలోచించుము, ఈ దినమున యెహోవా నిన్ను ఏలాగున గుహలో నా చేతికి అప్పగించెనో అది నీ కళ్ళార చూచితివే కొందరు నిన్ను చంపుమని నాతో చెప్పినను నేను నీయందు కనికరించి ఇతడు యెహోవా చేత అభిషేకము నొందినవాడు గనుక నా యేలిన వాని చంపనని నేను చెప్పితిని" అని ఆగాడు. పెద్దగా అరచి మాట్లాడుచున్నందున అలసట పొందినట్లయింది.

మరలా చేతిలోని వస్త్రపు చెంగు పొడుగుగా గాలికి ఎగిరేలాగ పట్టుకొని "నా తండ్రీ, చూడుము" అని చెయ్యి ఇంకొంచెం పైకి చాచి "ఇదిగో చూడుము, నిన్ను చంపక నీ వస్త్రపు చెంగు మాత్రమే కోసితిని కనుక నా వలన నీకు కీడు ఎంత మాత్రమును రాదనియు, నాలో తప్పిదము ఎంతమాత్రమును లేదనియు నీవు తెలిసికొనవచ్చును"

మరలా కొంచెంసేపు ఆగి "నీ విషయమై నేను ఏ పాపమును చేయని వాడనైయుండగా నీవు నా ప్రాణము తీయవలెనని నన్ను తరముచున్నావు. నీకును నాకును మధ్య యెహోవా న్యాయము తీర్చును. యెహోవా నా విషయమై పగ తీర్చును గాని నేను నిన్ను చంపను"

అబీషై, యాషాబాను ఇప్పుడు దావీదు ప్రక్కన నిలుచున్నారు. దావీదు వారివైపు తిరిగి "పూర్వం సామ్యము చెప్పినట్లు దుష్టుల చేత దౌష్ట్యము పుట్టును" అని సౌలువైపు తిరిగి "నేను నిన్ను చంపను".

మరలా యాషాబాను వైపు తిరిగి "ఇశ్రాయేలు రాజు ఎవనిని పట్టుకొన బయలు దేరి వచ్చియున్నాడు" నెతనేలు వైపు చూచి "ఏ పాటి వానిని తరుముచున్నాడు? చచ్చిన కుక్కను గదా? మిన్నల్లిని గదా?" అని సౌలువైపు తిరిగి

"యెహోవా నీకును నాకును మధ్య న్యాయాధిపతియై తీర్పు తీర్చును గాక. ఆయనే సంగతి విచారించి నా పక్షమున వ్యాజ్యెమాడి నీ వశము కాకుండా నన్ను నిర్దోషినిగా తీర్పు తీర్చును గాక!" అన్నాడు దావీదు.

సౌలు కళ్ళ వెంబడి నీరు ప్రవహిస్తుంది. దావీదు మాట్లాడటం చాలించిన తర్వాత "దావీదా... నాయనా... ఈ పలుకు నీదేనా?" అని ఇంకా బిగ్గరగా యేడ్చాడు. అలా కొంచెంసేపు ఏడుస్తునే ఉన్నాడు. అబ్నేరు దగ్గరగా వచ్చి సౌలు రాజు చేయి పట్టుకొని ప్రక్కనున్న రాతి బండ మీద కూర్చుండబెట్టాడు.

"యెహోవా నన్ను నీ చేతికప్పగించగా నన్ను చంపక విడిచినందుకు ఈ దినమున నీవు నా అపకారమునకు ఉపకారము చేసిన వాడవై నాయెడల నీకున్న ఉపకారబుద్ధిని వెల్లడి చేసితివి గనుక నీవు నాకంటే నీతిపరుడవు. ఒకనికి తన శత్రువు దొరికిన యెడల మేలు చేసి పంపివేయునా?" అని తల ఎత్తి దావీదుతో...

"ఈ దినమున నాకు నీవు చేసిన దానినిబట్టి యెహోవా ప్రతిగా నీకు మేలు చేయును గాక" అని లేచి నిలుచున్నాడు.

చేయి పైకి చాచి "నిశ్చయంగా నీవు రాజు వగుదువనియు ఇశ్రాయేలీయుల రాజ్యము నీకు స్థిరపరచబడుననియు నాకు తెలియును" అని కొంచెం ఆలోచిస్తున్నట్లుగా ఆగాడు. ఇప్పుడు గుహలో ఉన్న వారందరు దావీదు ప్రక్కన నిలిచి ఉన్నారు.

"కాబట్టి నా తరువాత నా సంతతి వారిని నీవు నిర్మూలము చేయకుండునట్లును నా తండ్రి ఇంటిలోనుండి

నా పేరు నీవు కొట్టివేయకుండునట్లును యెహోవా నామమున నాకు ప్రమాణము చేయుము" అన్నాడు సౌలు.

దావీదు వెంటనే తన రెండు చేతులు ముందుకు చాచాడు. సౌలు సైన్యమంతా ఒక్కసారిగా మాట్లాడటం మొదలు పెట్టారు. అబ్నేరు లేచి సహస్రాధిపతులను పిలిచి తిరుగు ప్రయాణం ఏర్పాటు చెయ్యమన్నాడు. దావీదు అతని అనుచరులు యుద్ధం గెలిచి దోపు సొమ్ముతో సంతోషించే వారివలె ఉల్లసించారు.

అహీనోయమును వివాహము చేసికొనిన తర్వాత ఇది తన తొలి విజయం. అహీనోయము యొక్క అమాయకపు ముఖం గుర్తుకు వచ్చింది. అడుగులు వేగమయ్యాయి. "ఇంక కొంతకాలం, అంటే సౌలు మనస్సు మరలా మారేంత వరకు విశ్రాంతి" అన్నాడు రెండవ అన్న అబీనాదాబు. దావీదు నవ్వుతూ అన్న ముఖంలోనికి చూసాడు.

అహీనోయముతో వివాహమైన తర్వాత సౌలుతో నిబంధన చేసుకున్న సంవత్సరం వరకు ప్రశాంతంగా జరిగిపోయినది. దావీదు తండ్రి అయ్యాడు కుమారునికి 'నమ్మకమైన' వాడు అనే అర్థమిచ్చే 'అమ్నోను' అని పేరు పెట్టాడు. యోనాతాను ఈ మధ్య రెండుసార్లు వచ్చి చూచి వెళ్లాడు.

తన అనుచరులలో కొందరిని యెజ్రెయేలులోను ఉంచాడు. భార్యబిడ్డలు ఉన్నవారిని యెజ్రెయేలులో ఉంచాడు. అందరూ ఎవరికి వచ్చిన పనివారు చేసుకుంటుండేవారు. పొలం పనులు చేత కానివారు యూదా అరణ్యంలో వేటకు వెళ్ళేవారు.

దావీదు అవసరతనుబట్టి అన్ని చోట్ల తిరుగుచూ వారి వారి అవసరతలు కష్టాలు, రోగాలు అన్నిటిలో వారికి బాసటగా వుండేవాడు. చాలామంది ధనవంతులు అంటే పశుసంపద కలిగినవారు గొఱ్ఱెల మందలు కలవారు మేకలు గలవారు యూదా అరణ్యంలో పశువులతోటే అక్కడే ఉండేవారు.

దావీదు అనుచరులు మొదట్లో ఎటువంటి వారైనా ఆయనతో సాంగత్యం చేసి ఆయన అనుచరులైన తర్వాత క్రమశిక్షణతో మర్యాదగా ఉండేవారు. ప్రతిదినం కొంచెంసేపు అందరూ యుద్ధపరికరాలు అభ్యాసం చేసేవారు.

ఒకరోజు యోనాతాను వద్ద నుండి వార్తాహరుడు వచ్చాడు. సమూయేలు ప్రవక్త తన స్వగృహంలో మరణించాడని చెప్పాడు. వెంటనే దావీదు పదిమందితో కలసి రామా బయలుదేరాడు. దాదాపు ముప్పై మైళ్ళు.

సాయంకాలము రామా చేరేటప్పటికి ఇశ్రాయేలు గోత్రాలలోనున్న పెద్దలందరూ అక్కడ ఉన్నారు. వారందరు చాలా ధనవంతులులాగా కనిపించారు. అయితే సమూయేలు బీదవాడుగానే చనిపోయాడు.

ఇశ్రాయేలీయులకు సౌలును రాజుగా అభిషేకించేంత వరకు ఆయనే ఏకైక న్యాయాధిపతి. తర్వాత రాజుకు ముఖ్యసలహాదారుడు. ప్రధానమంత్రి అయినా ఆయన ధనవంతుడు కాలేదు. కనీసం తన సమాధి కొరకైనా స్థలము సంపాదించుకోలేదు.

తనకు వచ్చే రాబడి ఏదైనా ఉంటే అది ప్రవక్తల శిష్యుల పాఠశాలకు ఖర్చు చేసేవాడు. రామాలో, మిస్పేలో, గిల్గాలు, బేతేలులో ప్రవక్తల పాఠశాలలు నిర్వహించాడు. ఇశ్రాయేలీయులు దేవునికి దూరమైనప్పుడు మోషే తర్వాత ప్రవక్త ఆఖరు న్యాయాధిపతి ఆయనే.

తనకు తండ్రిగా, గురువుగా, ఉపదేశకునిగా తన హృదయంలో నివశించాడు. ఆయన ఇక లేడు అన్నమాట తనని ఎంతగానో కృంగచేసినది. ఆయన ఇంటి స్థలంలోనే ఆయనను పాతిపెట్టిన తరువాత వెంటనే యెజ్రెయేలు వెళ్లాలనిపించలేదు. కనబడని దేవుడు హృదయంలో స్థిరంగా ఉన్నా తాను రోజు చూడకపోయినా సమూయేలు ఉన్నారనే భావన తనకు బహుధైర్యం పుట్టించేది. ఈనాడు ఈ లోకంలో ఆధారపడిన వాడు నా వారు అని చెప్పుకోగలిగిన వారు ఎవరూ లేరనే ఆలోచన తనను బహుగా కృంగదీస్తుంది.

**(సశేషం)**



# 'హ్యాపీ డేస్'



'అబ్బా... ప్చ్... ఆ హ్యాపీ డేస్ మళ్ళీ రావు' అని మన గత జీవితాన్ని తల్చుకొని బాధపడుతుంటాము కదా! ముఖ్యంగా స్కూలు, కాలేజీ రోజులు గుర్తొచ్చినప్పుడు అలాంటి భావన ఎక్కువగా కలుగుతుంది. చిన్నప్పుడు ఫ్రెండ్స్‌తో కలిసి ఆడుకున్న ఆటలు, చెప్పుకున్న ముచ్చట్లు, చేసిన అల్లరి పనులన్నీ గుర్తొచ్చినప్పుడు మనసు కాస్త ప్రశాంతంగా అనిపించి, మళ్ళీ అలాంటి రోజులు రావనిపించినప్పుడు బాధేస్తుంది. ఏం, ఇప్పుడెందుకు అలాగ ఉండలేము? అప్పటికీ ఇప్పటికీ ఏంటి తేడా? చిన్నప్పటి లాగా ఫ్రెండ్స్‌తో కలిసి ఇప్పుడు ఎందుకు సరదాగా గడపలేకపోతున్నామని అనిపిస్తుం టుంది. చిన్నప్పటిలా ఇప్పుడు మనం హ్యాపీగా ఉండలేక పోవడానికి కారణం ఫ్రెండ్స్ ఆటలు సరదాలు కాదు గానీ, అందుకు కారణం కేవలం మన మనసు మాత్రమే. చిన్న తనంలో మనకెలాంటి కుటుంబాన్ని పోషించే బాధ్యతలు ఉండవు. డబ్బు సంపాదించాల్సిన అవసరం ఉండదు. మన మనస్సు మీద ఎలాంటి ఒత్తిడి ఉండదు కాబట్టి ఆ రోజులన్నీ మనకి 'హ్యాపీ డేస్'లా అనిపిస్తాయి. ఒకవేళ చిన్నతనంలో కూడా కష్టాలు అనుభవిస్తూ కూలి పని చేసి ఇంట్లో సహాయ పడాల్సివస్తే అప్పుడు మనకి ఆ రోజులు 'హ్యాపీ డేస్'లా అనిపించవు. పెద్దయ్యేకొద్ది బాధ్యతలు పెరగటం, కుటుంబాన్ని పోషించాల్సి రావడం, డబ్బు సంపాదనలో తలమునకలై పోవడం ఇవన్నీ మన మనస్సు మీద ఒత్తిడి పెంచి సంతోష కరమైన జీవితాన్ని అనుభవించలేము. ఏ వయస్సులోనైనా సరే, మన మనస్సు ఆహ్లాదకరంగా ఉంటే అప్పుడు మనం 'హ్యాపీ డేస్' అనుభవించగలం. దేవుని మీద ఆధారపడి జీవించేవారి మనస్సు ఎప్పుడూ ఆహ్లాదకరంగా ఉంటుంది. దేవుని మీద ఆధారపడి జీవించినంత మాత్రాన అస్సలు కష్టాలు, బాధలు, సమస్యలు ఉండవని కాదు. దేవుని మీద ఆధారపడి జీవించని వారికి ఎలాంటి కష్టాలు ఉంటాయో, దేవుని మీద ఆధారపడిన వారికి కూడా అలాంటి కష్టాలే ఉంటాయి. అయితే దేవుని మీద ఆధారపడినవాళ్ళు తమ ప్రతి కష్టాన్ని, బాధని దేవునికి అప్పజెప్తారు, కాబట్టి దేవుని మీద ఆధారపడని వాళ్ళ మనసు మీద ఉండే వత్తిడి ఉండదు. దేవుని మీద ఆధారపడి జీవించేవాళ్ళ జీవితం చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. వాళ్ళ జీవితాలలో దేవుడు చేసే ఆశ్చర్యకార్యాలను బట్టి వాళ్ళు ఎప్పుడూ సంతోషంగా ఉంటారు. 'యెహోవా, నీ కార్యముచేత నీవు నన్ను సంతోషపరచుచున్నావు నీ చేతి పనులనుబట్టి నేను ఉత్సహించుచున్నాను' (కీర్తనలు 92:4). దేవునితో లేనివాళ్ళ జీవితంలో సంతోషం తాత్కాలికంగా, అప్పుడప్పుడు మాత్రమే ఉంటుంది. మనుష్యుల జీవితాలలో పరిపూర్ణమైన సంతోషం దేవున్నిబట్టి తప్ప మనుష్యులనుబట్టి అస్సలు ఉండదు. ఎప్పుడో జరిగిపోయిన 'హ్యాపీ డేస్'ని గుర్తు తెచ్చుకోవాల్సిన అవసరం దేవుని మీద ఆధారపడి జీవించే వారికి ఉండదు. ఎందుకంటే వాళ్ళు ఎప్పుడూ సంతోషంగానే ఉంటారు. వాళ్ళ జీవితంలో దుఃఖకరమైన, బాధపడిన సంఘ టనలు ఏమున్నాయా అని ఆలోచించుకోవాల్సి ఉంటుంది. దేవుని మీద ఆధారపడి జీవించే వాళ్ళతో దేవుడు ఎప్పుడూ ఉంటాడు కాబట్టి వాళ్ళ జీవితం నల్లేరు మీద నడకలా సాగి పోతుంది. మన జీవితంలో పరిపూర్ణ సంతోషం దొరకాలంటే కేవలం దేవున్ని నమ్మితే సరిపోదు, ఆయన మీద ఆధారపడి జీవించినప్పుడు మాత్రమే మనకి 'హ్యాపీ డేస్' ఉంటాయి. మరి మీరు జీవితాంతం సంతోషంగా బ్రతకాలనుకుంటు న్నారా? లేదంటే ఎప్పుడో జరిగిపోయిన హ్యాపీ డేస్‌ని గుర్తుతెచ్చుకుంటూ బ్రతకాలనుకుంటున్నారా?


**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# యేసు పాదసన్నిధి

బేతనియ అను గ్రామంలో మార్తా అను ఒక స్త్రీ ఉండెను. ఆమెకు మరియ అను సహోదరి, లాజరు అను సహోదరుడును ఉండెను. యేసు ప్రభువు మరియు ఆయన శిష్యులు ప్రయాణంలో భాగంగా బేతనియలో ప్రవేశించెను.

మార్తా ఆయనను తన ఇంట చేర్చుకొనెను మరియ యేసు పాదముల యొద్ద కూర్చొని ఆయన బోధ వినుచుండెను (లూకా 10:39).

అంతట మరియ యేసు ఉన్న చోటికి వచ్చి ఆయనను చూచి ఆయన పాదముల మీద పడి ప్రభువా నీవు ఇక్కడ ఉండిన యెడల నా సహోదరుడు చావకుండుననెను. (యోహాను 11:32)

మరియ మిక్కిలి విలువగల అచ్చజటామాంసి అత్తరు ఒక సేరున్నర యెత్తు తీసుకొని, యేసు పాదములకు పూసి తన తల వెంట్రుకలతో ఆయన పాదములను తుడిచెను (యోహాను 12:3).

పై మూడు సందర్భాలలో మరియ యేసు పాదములను ఆశ్రయించెను. మార్త అయితే దేవుని కొరకు పని చేయుటకు ఎంతో ఆతృతపడెను కానీ అవసరమైనది ఒక్కటే... మరియ ఉత్తమమైనది ఏర్పరచుకొనెను, అది ఆమె వద్ద నుండి తీసివేయబడదని యేసు చెప్పెను (లూకా 10:42).

ఏంటి ఆ ఒక్కటి, మరియ యేసును ఆరాధించింది. యేసు కొరకు చేసే పని కన్నా, యేసుతోనే ఉండాలి అనుకుంది మరియ. నీవు కూడా దేవుని సువార్తను లోకమునకు చాటే రాయబారిగా ఎంతో బిజీగా ఉన్నావా? లేక మన తోటి వారికి, పొరుగు వారికి, సహాయపడాలనే మంచి సమరయునిగా ఉన్నావా? వీటన్నిటికంటే ముందు అవసరమైనది ఒక్కటే..... అదే దేవుని పాదములు వద్ద నీ సమయాన్ని గడపడం. ఈ బిజీ ప్రపంచంలో మీకు అన్నిటికీ సమయము ఉండవచ్చు కానీ, దేవుని పాదములు యొద్ద ఏకాంతముగా ఎంత సమయం గడుపుతున్నారు అనేది దేవునికి ముఖ్యం.

నీవు సమస్యలలో పడినప్పుడు, నీ ఆత్మీయ జీవితం గురించి నిన్ను నీవే ప్రశ్నించుకొన్నట్లయితే, దేవునితో నీ సంబంధం ఎలా ఉందో పరీక్షించుకుంటే, నీ సమస్యకు పరిష్కారం వెంటనే దొరుకుతుంది. దేవుని దృష్టికి పాపమే కాదు, పొరపాటు కూడా ఖరీదైనదే... నీ పొరపాటులను సరిచేసుకొని దేవుని పాదములును పట్టుకుంటే నీ జీవితం మారిపోతుంది. దేవుని ఆరాధకునిగా, ప్రేమికునిగా మరియ వలె మారిపోతావు. దేవుని పాదములు యొద్ద అనుదినము గడిపినచో, ఆ దినమునకు కావలసిన జీవాహారము నీకు దొరుకును.

మనుష్యుడు రొట్టెవలన మాత్రం కాదు గానీ దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలనను జీవించును. (మత్త. 4:4)

దేవుని పాదములు యొద్ద ఎన్నో నేర్చుకోగలము. దేవునికి మార్తా వలె ఆసక్తితో పనిచేసేవారు, మరియ వలె ఆత్మతో ఆరాధించే వాళ్ళు కావలెను, కానీ అవసరమైన దాన్ని నీవు ప్రాముఖ్యమైనదిగా మొదట ఎంచుకోవాలి. దేవుడు కూడా నీ నుండి కోరుకునేది ఆ ఒక్కటే.... నీవు ఆయనతో ఒంటరిగా ఆయన పాదములు యొద్ద సమయం గడపాలని, అది నీ ఆరాధించే మనసుకు సాటి... రహస్యంగా ఆయనతో గడుపు, ఆయనను చూస్తూ ఆయన పోలికలోనికి మారు, ఎటువంటి పరిస్థితి అయినా.. అది విందులో అయినా, చావులో అయినా మరియ వలె యేసు చరణములే మనకు శరణం. ఆయన ప్రేమలో మునిగి తేలియాడు.... అన్నిటికంటే ముఖ్యమైనది అదే.... ఆయన్ను హద్దు లేకుండా ప్రేమించడం... ఆ ప్రేమలో నుండి ఆయన కొరకు నీవు చేసే పరిచర్య పుడుతుంది. దేవుని పరిచారకుని వలె, స్నేహితుని వలె, ప్రభువు ఆరాధికుని వలె, ప్రేమికుని వలె నీవు మార్పనొందుదువుగాక గాక.

నీ ఆవరణములో ఒక దినము గడుపుట వెయ్యి దినములు కంటే శ్రేష్టము (కీర్తనలు 84:10)

ఇట్లు

**డా॥ సి. హెచ్.కె. సుష్మ, నెల్లూరు**

# మధ్యకాలము

ఈ విజయము యూదాకు కొంత గౌరవము చేకూర్చెను. మరియు అతడు దేవాలయమును, నిజదేవుని ఆరాధించుటకే తిరిగి సమకూర్చి, అందరిని తొలగించి మలచబడని రాళ్ళతో బలిపీఠమును కట్టి, యుద్ధమందు అంతియోకస్ దోచుకొనిపోయిన బంగారు సామాగ్రిని, పాడైపోయిన ఇతర సామాగ్రి అంతటిని తిరిగి చేర్చెను. ఆ విధంగా యూదా ఆలయమును తిరిగి ప్రతిష్టించెను. మరియు ఆలయ ప్రతిష్టిత విందును ప్రతి సంవత్సరము ఆచరించునట్లు ఇంకెప్పటికి అతని జ్ఞాపకార్థముగా దాదాపు జ్ఞాపకార్థ ఉత్సవము జరిగెను.

ఆక్రా పర్వతము మీద ఉన్న దుర్గమును వశపరచుకొనుట అతని ఆశయయైయుండెను. అపొల్లోనియస్ ఆలయము నిలువబెట్టుటకు ఆజ్ఞ ఇచ్చెనుగాని ఇంకా అది అన్యుల ఆధీనములో ఉన్నందున వారు ఆరాధించుటకు వెళ్ళు యూదులపై కోపగించుకొనిరి. గోడను కట్టుటకు ఎక్కువమంది పురుషులు లేనందున ఆ పని ఆపి మరొక దుర్గమును ఆలయమున్న కొండపై కట్టెను.

ఈ తిరుగుబాటు మరియు యూదుల యొక్క విజయము అంతియోకస్‌కు తెలుపబడినప్పుడు అతడు తన పర్షియా సాహసయాత్రలో యెరూషలేమును నాశనం చేసి ప్రజలందరికి సమానమైన సమాధుల స్థలముగా మార్చుతానని భయపెట్టెను. కాని తక్షణమే దేవుడు అతనిని పెద్ద రణములతో ముట్టెను. అతడు ప్రేవులలో భయంకరమైన బాధననుభవించెను. అతని హృదయమంతా భయంకరమైన ఆలోచనలతోను, దురాత్మల తోను నిండియుండెను. అతడు తన కౄరత్వమునకు నపుంసకు లను బాధించినందులకు అది దేవుని యొక్క శిక్ష అని ఒప్పుకొనెను. తను వ్యాధినుండి స్వస్థత నొందితే దేవుని కొరకు మంచిపనులు చేయుదునని వాగ్దానములు చేసెను కాని దేవుడు అతని మనవి అంగీకరించలేదు. అందువలన అతని శరీరము ఆ కుదరని వ్యాధి వలన సగము క్రుళ్ళిపోయి మరణించెను.

యూదా మక్కబియన్ ప్రభుత్వమును సుస్థిరపరచుటకు నిశ్చయించుకొని మస్పలో జరిగిన సాధారణ కూడికలో ఒక పూర్వకాలపు చట్టమును తీసికొని వెయ్యిమంది ప్రజలకు, వందమంది ప్రజలకు, ఏభైమంది ప్రజలకు, పదిమంది ప్రజలకు ఒక్కొక్క అధికారిని నియమించెను. సన్‌హెడ్రిన్ యొక్క ప్రధాన న్యాయస్థానము యొక్క రాజనీతి విధానమును కూడా అతడే వ్రాసెను. అందులో ప్రతినిధి, ఉపప్రతినిధి మిగిలిన సభ్యులు లేక సెనెటర్స్, పండితులు, న్యాయశాస్త్రంలో జ్ఞానము కలిగినవారు, యాజకులు, సామాన్యులు ఒక గొప్ప ఆలోచన సభగా ఉండి, ఆస్మోనియన్ రాజుల యొక్క అధికారములో శక్తిగల్గిన సభగా తయారై మన రక్షకుడైన యేసుక్రీస్తు బోధించు దినములలో ఈ సెనెట్ గొప్ప అధికారంతో ఉండెను.

యూదాచే అవమానించబడి తొలగించబడిన లిసియాస్, అంతియోకస్ కుమారుడైన అంతియోకస్ యుపేటర్ అను 9 సం॥ల బాలుని సంరక్షణలో ఉండి అతనిని సింహాసన మెక్కించి ప్రభుత్వమును ముట్టడి వేసి వెంటనే పొరుగువారైన యిదుమేనీయులతోను ఇతర దేశపు శత్రువులతోను, యూదా దేశముతోను కలిపి ఇశ్రాయేలీయుల వంశమును పూర్తిగా నశింప చేయుటకు ప్రయత్నించెను

ఈ రహస్యపు దురాలోచన అందచేయబడినప్పుడు వారి ఉద్దేశ్యములు అరికట్టుటకు యిదుమీయలోనే యుద్ధము చేయపూనుకొనెను. ఆ విధంగా అక్రాబిటినే యూదయ యొక్క ఒక భాగము ద్వారా మృతసముద్రపు పశ్చిమ భాగం వైపుగా వీరి దేశములోనికి ప్రవేశించి వారిలో 20,000 వేలమందిని హతమార్చెను. యిదూమీయుల మరొక గోత్రమైన బీను ప్రజల మీద పడి మరొక 20,000 మందిని హతము చేసి వారి సైన్యమంతా నాశనం చేసి వారి కోటను స్వాదీనపరచు కొనెను. యొర్దాను దాటుతూ అమ్మోనీయుల ప్రాంతములో అడుగుపెట్టి అనేక విధాలుగా వారిని ఓడించి వారిని ఎక్కువ సంఖ్యలో హతమార్చెను. గిలాదు పర్వతము యొక్క అడుగుభాగమున జాజాను నది ఒడ్డున ఉన్న పట్టణమును స్వాధీనపరచుకొనెను.

**(సశేషం)**

**సాక్ష్యము**

# విజయసారథి

నా పేరు కోటేశ్వరరావు. నా బాల్యం అంతా హిందూ సాంప్రదాయంలోనే సాగింది. హిందూ దేవతలను ఆరాధించే వాడిని. నా తలిదండ్రులు, స్నేహితులు ఆ దైవ పూజలలో అనేక దేవతా విగ్రహాలు సేవించేవారు, వారితో పాటు నేను కూడా విగ్రహారాధన చేసేవాడిని.

నా బాల్యంలో నేను ఒక మంచి క్రైస్తవ విద్యా సంస్థలో విద్యాభ్యాసం కొనసాగించాను. అది గవర్నమెంటు గుర్తించిన సంస్థ. ప్రతి దినం దైవ ప్రార్థన జరిగేది. ఆ సంస్థలోని విద్యార్థులందరూ చాలా వరకు పేదవారే ఎందుకంటే అది గవర్నమెంటు అనుబంధ పాఠశాల పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత రేటు చాలా తక్కువ నేను కూడా ఆ కోవకు చెందిన వాడనే. మా ఉపాధ్యాయులంతా నేనొక ఉత్తమ విద్యార్థిననియు, బాగా చదువుకుంటాననే సదభిప్రాయంలో ఉండేవారు. వాస్తవ స్థితి అది కాదు.

నాకు క్రీస్తు అంటే చాలా యిష్టం. మా స్కూలులో జరిగే ప్రార్థనలు బైబిలు వాక్య పఠనం నాకెంతో ఆదరణ, శాంతి సమాధానాలిచ్చేవి. ఆ కారణంగా చిన్నతనంలో నేను యేసును గూర్చి వినిన మాటలు – నేనే మార్గమును సత్యమును జీవమునైయున్నాను. మీరు లోకానికి వెలుగు, విలువగల ఉప్పు, మీ సత్క్రియలతో దేవుని మహిమ పర్చాలి. ఆత్మ విషయమై దీనులుగా ఉండాలి నిజమైన భక్తి శ్రద్ధలతో నిజదేవుని కొలవాలి. "నిన్న నేడు రేపు ఒకే రీతిగా ఉండేది దేవుడే" వంటి మాటలు నాకు క్రీస్తు మీద నమ్మకాన్ని కలిగించాయి.

మత్తయి 5,6, అధ్యాయాలు నాకు చాలా యిష్టం. నాకు మంచి మార్కులు ప్రసాదించే దేవునిగా నమ్మి విశ్వాసంతో ప్రార్థించేవాడిని. ప్రతి పరీక్షలో నేను అపజయం కలిగి ఉండే వాడిని. ఎంత కష్టపడినను కనీసం ఒక్క సబ్జెక్ట్‌లోనైనా అపజయం కలిగేది "మంచి మార్కులు ప్రసాదించండి ప్రభువా" అని భారంతో ఆశతో ప్రార్థించేవాడిని. పదవ తరగతి అర్ధ సంవత్స పరీక్షల వరకూ అపజయమే. నాకు రెండు విషయాలెప్పుడూ ఆందోళన కల్గించేవి. ఒకటి, నా భవిష్యత్తు ఎట్లుంటుంది? నా వాళ్ళు, తలిదండ్రులు, బంధువులు స్కూలు ఉపాధ్యాయులు, స్నేహితులు, ప్రైవేటు మాస్టార్లు నాపై గొప్ప నిరీక్షణ కల్గి ఉండేవారు. "కోటేశ్వరరావు తప్పక విజయం పొందగలడు" అని అనేవారు. నాకు చాలా భీతిగల మనస్సు ఉండేది దీని నిమిత్తమై మరింత పట్టుదలతో దీక్షతో అచంచల విశ్వాసంతోయేసుక్రీస్తును ఆశ్రయించి, నమ్మకంతో దీనంగా ప్రార్థించుకునే వాడిని. కేవలం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడను కావాలనే కాంక్ష.

నా ప్రార్థనలన్నీ ఆలకించి నా హృదయ వాంఛలన్నీ తీర్చిన ప్రభువు. ప్రతి జీవి కోరికలను తన గుప్పిలి విప్పి నెరవేర్చే యేసుప్రభువు పట్ల నాకు అసమానమైన అమితమైన భక్తి విశ్వాసాలు స్థిరపడి పునాదిగా నిలిచిన మొదటి మెట్టు, ఆ గొప్ప విజయమేదనగా నేను పబ్లిక్ పరీక్షలలో ప్రథమ శ్రేణిలో విజయాన్ని పొందడమే, దేవునికి స్తోత్రం హల్లెలూయా.

క్రైస్తవ సంస్థలో అందరం కలిసి అందంగా స్తుతి పాటలు పాడేవారం. దేవుని వాక్యాన్ని ధ్యానించేవారం అదెంతో శాంతిని ఆనందాన్నిచ్చేది. వారి బోధలు ఎంతో విలువైనవి, జీవితానికి దిక్సూచి వంటివి. బైబిలు మనలను సరిగ్గా నడిపిస్తుంది ఎప్పుడంటే మంచి భక్తి కలిగి, దేవుని నమ్మి జీవించినప్పుడే. చింత, కోపం, గర్వము చెడు తలంపులు వంటి వాటిని జయించడం చాలా కష్టము, మనలను గూర్చి దేవునికి అంతా తెలుసు. ఆ దేవుడు మనకై చనిపోయి, తిరిగిలేచి, పరలోకానికి ఆరోహణమయ్యారు. ఆ విజయపు జీవధారలు పెల్లుబికి, పాపాలనుండి విడుదల నిచ్చి విజేతలుగా నిలుపుతుంది. యుద్ధం లేనిదే విజయం లేదు. పరీక్ష లేనిదే ప్రమోషన్ లేదు. క్రీస్తు చేసిన గొప్ప కార్యాలను గూర్చి విశాల భావాలు కల్గి ఉండాలి. ఎఫెసీ. 1:19లో చెప్పబడినట్లు ఆత్మీయ నేత్రాలు వెలిగింపబడాలి. యివన్నీ

తెలియని రక్షణానుభవ ఫలితం శూన్యం. యేసుక్రీస్తు నా మనవి ఆలకించి ఆయన చెవియొగ్గి నా మొర్రకు ప్రతిఫలాన్నిచ్చిన గొప్ప దేవుడు. ఆ తర్వాత ఇంటర్ పరీక్షలలో విజయం చేకూరేలా సహాయం చేసారు. నా ప్రార్థన కొనసాగించాను. శ్రీమతి ఎ.వి.ఎన్.కళాశాలలో ప్రవేశం కొరకు యం.పి.సి గ్రూప్‌లో సీటు కావాలని కోరుకొని ప్రార్థించాను. మరొకసారి నా మనవి మన్నించి రెండు కోరికలు నెరవేర్చారు.

నేను పదవతరగతివరకు తెలుగు మీడియం స్కూలులో విద్యాభ్యాసం గనుక ఇంగ్లీషులో ఇంటర్ చదవడం నాకు చాలా క్లిష్టపరిస్థితిగా తోచేది. ప్రతి మాటను డిక్షనరీ ద్వారా అనువాదం చేసికొని, ప్రతి మాట అర్థం చేసికోవడానికి మూడు చెరువుల నీళ్ళు త్రాగాను. ఎంతో శ్రమించాను. "అనుదినం, అనుక్షణం నీ సహాయం నాకు అవసరం యేసూ, నీ బిడ్డ నేనయ్యా, నన్ను కనికరించు" అని దీనంగా ప్రార్థించుకొనేవాడిని. దేవుడే నాకు ప్రతి ఘట్టంలో తోడుగా ఉండి నన్ను నడిపించారు. విజయానిచ్చారు. అద్భుత రీతిగా ప్రభువు నా ప్రార్థనలకు జవాబుగా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత, ఎమ్‌సెట్ ప్రవేశ పరీక్షలలో 2080 ర్యాంకు నిచ్చి సంతోషపెట్టారు. దేవుడిచ్చిన విజయాల పరంపరకై ఆ అద్భుత ఘడియలకై ఎంతగానో ఆనందించి స్తుతించాను.

నా కోరిక అంతటితో ఆగలేదు. అడుగుడి మీకివ్వబడును. వెదకుడి మీకు దొరుకును. తట్టుడి మీకు తీయబడును అను దేవుని వాక్యం స్వతంత్రించుకున్నాను. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో సీటు కావాలని మరలా ప్రార్థించసాగాను. విశాఖపట్నంలో కావాలని స్పష్టంగా అడిగాను. దేవునికి స్తోత్రం, శాశ్వతమైన ప్రేమతో ఆదరించే దేవుడు నేను కోరినట్లే నాకు జవాబిచ్చి నడిపించారు. దేవుడు నాకు తోడుగా ఉండి అడిగిన వాటిని అనుగ్రహిస్తూ ఊహించని జవాబులనిచ్చి ప్రేమించి ఆదరించే కొలది, మరింత విశ్వాసంలో ఆ దేవుని కృపాసనం దగ్గరకు ధైర్యంగా చేరి మరెన్నో విషయాల కొరకు ప్రార్థించి జవాబు పొందాను. 10వ తరగతిలో అపజయాలతో నలిగిపోయిన నేను ధైర్యంగా ఎమ్.టెక్., ఐ.ఐ.టిలో చేరాలని ప్రార్థించగా గొప్ప మార్కులతో విజేతగా నిలిచాను. 95.39% మార్కులు పొందాను. ఢిల్లీ ఐ.ఐ.టిలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోరినట్లు సీటు లభించింది. ఎంత గొప్ప దేవుడు నా క్రీస్తు!

నా జీవితంలో లెక్కించలేని సందర్భాలలో దేవుడు తనకు తాను ఉన్నవాడను అనువాడనని ప్రత్యక్షపరచుకున్నాడు. నేనెల్లప్పుడు ఆ దేవదేవునికి వందనస్తుడను. నాకెన్నో మేలులు చేసిన దేవుని యెడల నాకున్న అభిప్రాయమేమంటే అంచంచల విశ్వాసంలో, పసిపిల్లల వంటి హృదయంతో అడిగినవాటిని పొందుకోగలమని, అడిగితే ప్రభువు అన్నీ దయచేయగలరు.

కీర్తనలు 111:10 "దేవునియందలి భయభక్తులు జ్ఞానమునకు మూలము" యిదే నా వాక్యం. నా విశ్వాసానికి పునాది.

దేవునిని నా కోరికలు అడిగి పొందుకోవడమే తెలుసు గాని రక్షణానుభవం గూర్చిన అవగాహన బొత్తిగా లేదు. దేవుడు నన్ను ప్రేమించి సాటియైన సహకారిగా నాకు కవితను ధర్మపత్నిగా బహుకరించారు. నా వలె హిందూ మతస్తురాలు అయినా క్రైస్తవ సంస్థలో విద్యాభ్యాసం వలన క్రీస్తును గూర్చి తెలుసుకొని విశ్వాసముంచింది. దేవుని మహాకృపవల్ల అమెరికాలో ఉద్యోగం కోసం యిద్దరం వెళ్ళాము. మాకున్న క్రైస్తవ విశ్వాసాన్ని బట్టి మొదటి బాప్టిస్టు సంఘం అమెరికాలో ఫ్లోరిడాలో సంఘ సభ్యులుగా చేరాక రక్షణ అనే మాటకు సరియైన అవగాహన, జ్ఞానాన్ని పొందాము. వారందించిన బోధల సారాంశములో రక్షణ పొందుటకు ఏమి చేయాలి? పాపక్షమాపణ పొందుటెట్లు? మారుమనస్సు అవశ్యకత ఏమి? ప్రతి క్రైస్తవ విశ్వాసి నిరీక్షణ ఏమి? బాప్తిస్మం అవసరం ఏమి? వంటి అనేక విషయాలు గురించి తెలుసుకున్నాము. మా యెడల అధిక శ్రద్ధతో ప్రేమతో మా సంఘస్తులు, అన్యజాతి మతస్తులను స్వీకరించిన క్రీస్తు ప్రేమ, మమ్ములను ముగ్ధుల్ని చేసి బాప్తీస్మ అనుభవాన్నిచ్చింది. హల్లెలూయా, ఎంత ఆనందం. ఆహా!

ఎంత సంతోషం. యేసు నాలో ఉన్నందున మాతో మా కుటుంబంలో మొదటి స్థానమిచ్చాము. 2000 సం॥ము ఏప్రిల్ 5వ తేదిన బాప్తీస్మము తీసుకున్నాము. ప్రభువు మాకు అతిసన్నిహితులై మమ్ములనెంతో ప్రేమించి ఆదరించారు.

మా జీవితాలను అద్భుతంగా నడిపించే విధానం మాకెంతో ఉత్తేజాన్ని ఆహ్లాదాన్ని కల్గించి ఆ దేవుని మేమిద్దరం కలిసి స్తుతించి కృతజ్ఞతతో మెలిగేవారం. దైవ గ్రంథపఠనము ప్రార్థన ద్వారా దేవుని నడిపించే హస్తాన్ని దినదినము పట్టుకొని సాగిపోయాము. దైవవాక్యాన్ని ధ్యానించడం, నేర్చుకోవడం మా వ్యక్తిగత జీవితాలను ఆత్మీయంగా బలపర్చేవి. ఏ శక్తి అయితే క్రీస్తును విజేతగా నిల్పిందో ఆ పరిశుద్ధాత్మ శక్తి మాలో ఉందని గ్రహించాము. విశ్వంలో అతిశక్తివంతమైన పునరుత్థాన శక్తిని అనుభవించాము. మాకు అజయ్, అజిత్ అను కవల బిడ్డలను 2001లో దేవుడు ప్రసాదించారు. వీరితోపాటు సంఘానికి వెళ్ళి ఆరాధిస్తాము. (వారికి క్రీస్తు అంటే చాలా యిష్టం). సుధ, శ్రీకాంత్ మా స్నేహితులు, మా విశ్వాసాన్ని సుధ విశ్వాసిగా చాలా అభిమానిస్తుంది. పరిశుద్ధాత్మ శక్తి నడిపింపుతో మేమున్న ప్రాంతములో క్రీస్తును గూర్చి సాక్షమిస్తున్నాము. మా జీవితాలు ప్రభువునకే అంకితం. ఆయన మార్గాలు మా జీవపు నిధి. మా జీవితాల్లో దేవుడు ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. మా జీవిత విజయ రథసారథి క్రీస్తే అని మా ప్రగాఢ విశ్వాసం. మార్కు 9:23 నమ్మువానికి సమస్తం సాధ్యమే. దేవునికి నిండు హృదయంతో కృతజ్ఞతతో స్తుతిస్తున్నాము. చదువరీ, నా జీవితాన్ని క్రీస్తు ఎంత నమ్మకంగా నడిపించారో, మిమ్ములను కూడా నడిపించాలని ప్రార్థిస్తూ, దేవుని నామానికి స్తోత్రములు, ఆమేన్.

## గమనిక

క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

## చందాదారుల వివరములు

రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి - 5000/-
మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
రావెల ప్రసాదరావు, గుంతకల్లు (21-06-24) - 5000/-
వై. సంధ్యారాణి, ఒంగోలు - 2000/-
అపో. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)-1500 (నెలకు)
డా॥ సిహెచ్‌కె. సుష్మ ప్రశాంత్, నెల్లూరు - 1500/-
జయ, గుంటూరు (6-3-24)- 1500/-
గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000
జి.మాణిక్యమ్మ అనంతపురం (25-3-24) 1000/-
కె. రజిని, నరసరావుపేట - 1000/-
వి. కస్తూరి, భీమవరం 500/-
శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-
పి.వి.రెడ్డి, ఒంగోలు - 500/-
బి. నెహెమ్యా, చిన్నగంజాం - 500/-
నైటింగేల్, నెల్లూరు - 500/-
మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ - 500/-
డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల - 500/-
ఆర్. దేవికుమారి, పర్చూరు (20-5-24) 500/-
వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
జి. కళావతి, ఒంగోలు 350/-
కె. కల్పన, గోవా - 350/-
జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి - 350/-
సి.హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట (18-3-24) 350/-
కె. రాజేష్, రాజమండ్రి - 350/-
యస్. గోపి, పార్వతిపురం - 350/-
శ్రీమతి. సరోజిని -350/-
పి. దేవదానం, గుంటూరు - 300/-
పి. యేసుబాబు లోకేష్, చింతలపూడి - 200/-
ఆర్. ఇన్నయ్య, గుంతకల్ - 200/-
టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు - 350/-
జి. జార్జిథామస్, దుగ్గిరాల - 500/-
టి.యం. భగవాన్‌దాస్, కదిరి (7-3-24) - 350/-
కె. విజయకుమార్, ఒంగోలు (1-3-24) 350/-
జె. రాజేష్, ఒంగోలు (6-7-24) 350/-

**బైబిల్ క్విజ్-07 జవాబులు పంపినవారు :**

1. ఆనీమేరి, హైదరాబాద్, 2. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 3. స్వప్నిక-మార్కాపురం, 4. లలిత-రాజమండ్రి, 5. సబిత-కాకినాడ, 6. వి.రత్నమ్మ-హైదరాబాద్, 7. రాధ-నెల్లూరు, 8. స్టీఫెన్-వరంగల్, 9. కుమారి-తెనాలి, 10. వెంకట్రావు -హైదరాబాద్, 11. ప్రియ-తాడిపత్రి, 12. రాజేష్-కడప. 13. ప్రియాంక-విజయవాడ.

# నీ సృష్టికర్త

మానవుని దేహ నిర్మాణం ఒక అద్భుతం. దాని పనితీరు సామార్థ్యం మానవ శక్తి పరిమితులను దేవుని అపరిమిత శక్తిసామార్థ్యలను చాలా స్పష్టంగా తెలియజేస్తుంది. దేవుడు లేడనే వారికి, జీవపరిణామ సిద్ధాంతమే మానవజాతి ఉనికికి ఆధారం అనే నమ్మేవారికి సరియైన జవాబు వారి శరీరమే. హేతుబద్ధంగా ఆలోచించేవారెవరైనా సరే మానవ శరీరమును పరిశీలిస్తే దేవుని ఉనికిని ఇట్టే కనుగొనగలరు అటువంటి అద్భుత నిర్మాణం మానవ ఆకారం.

మానవ శరీరం ఎన్నో అద్భుతమైన వ్యవస్థలు కలిగిన సంక్లిష్ట నిర్మాణం. అందులో ఒకటి విసర్జన వ్యవస్థ. మన శరీరంలోని వ్యర్థాలను రక్తం నుండి వేరు పరచి వాటిని బయటకు పంపివేయడం విసర్జన వ్యవస్థ యొక్క ముఖ్య విధి. ఈ వ్యవస్థలో ముఖ్యమైన భాగాలు కిడ్నీలు (మూత్రపిండాలు), బ్లాడర్, మూత్రనాళాలు.

కిడ్నీలు చిక్కుడు గింజ ఆకారంలో లివర్ భాగానికి క్రిందుగా వెనుక వైపు రెండు వైపుల ఉంటాయి. వీటిలో కుడి వైపు ఉండే కిడ్నీ ఎడమ కిడ్నీ కంటే కాస్త చిన్నగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధీకరించడం మూత్రపిండాల ముఖ్య విధి. ఆహారం ద్వారా, శ్వాస ద్వారా రకరకాల వ్యర్థపదార్థాలు శరీరంలోకి తద్వారా రక్తంలోకి ప్రవేశిస్తాయి. శరీరంలో ఉ ండే రకరకాల కణాలు నిరంతర జరిపే జీవక్రియలలోను వ్యర్థాలు విడుదలయ్యు అవి రక్తంలోకి చేరతాయి. ఇలా వ్యర్థాలతో కలిసిన రక్తం కిడ్నీలకు చేరుతుంది. కిడ్నీలలో సున్నితమైన కణజాలం ఉంటుంది వాటినే నెఫ్రాన్స్ అంటాము. ఈ నెఫ్రాన్స్ లోను రెండు భాగాలు ఉంటాయి. ఒకటి గ్లోమరస్, ఇది రక్తంలో శరీరానికి అవసరమయ్యే విటమిన్స్ మినరల్స్ వంటి పోషకాలను వేరు చేసి రక్తంలో కలుపుతుంది. నెఫ్రాన్ యొక్క రెండవ భాగమైన ట్యూబెల్ పెద్ద అణువులను విచ్ఛినం చేసి శరీరానికి అవసరం లేని వాటిని నీటితో కలిపి యూరిన్‌గా మారుస్తుంది. ఇలా తయారైన మూత్రం మూత్ర నాళాల ద్వారా బ్లాడర్ అనబడే సంచి వంటి భాగానికి చేరుతుంది. అక్కడ నుండి బయటకు విసర్జింపబడుతుంది.

రక్తాని శుద్ధీకరించేది గుండె అనుకుంటాము కానీ గుండె చెడు రకాన్ని మంచి రకాన్ని వేరు చేస్తుంది అంతే. వాస్తవానికి రక్తాన్ని శుభ్రపరిచేవి కిడ్నీలు. కేవలం రక్తశు ద్ధీకణే కాక, శరీరం నీటి నిల్వలను, క్షార ఆమ్ల స్థితిని కిడ్నీలు నియంత్రిస్తాయి. శరీర అవసరతను బట్టి విటమిన్ 'డి'ని ఎర్రరక్తకణాలను ఉత్పత్తి చేస్తాయి

కిడ్నీలు ఒకరోజుకు దాదాపు 180 లీటర్ల రక్తాన్ని శుభ్రపరుస్తాయి. 180 లీటర్ల రక్తాన్ని శుద్ధీకరించటం అంటే దాదాపు 400 సార్లు రక్త శుద్ధీకరణ ప్రక్రియను చేస్తాయి.

అంతేకాకా 1500 లీటర్ల ప్రతి మనిషిలో దాదాపు ఒక మిలియన్ అంటే 10 లక్షల నెఫ్రాన్స్ ఉంటాయి.

కిడ్నీలు మొత్తం శరీరం బరువులో 0.5% బరువును కలిగి ఉంటాయి. కిడ్నీలు దాదాపు 170 గ్రాములు బరువు, 4.5 అంగుళాల పొడవును కలిగి ఉంటాయి.

శరీరం మొత్తంలో అన్ని భాగాల కంటే గుండె, మెదడు, ఊపిరితిత్తులు కంటే ఎక్కువ శాతం రక్తం కిడ్నీలను చేరి ఆ తరువాత శరీర భాగాలకు చేరుతుంది.

రక్తం శుద్ధీకరించడం ద్వారా వ్యర్థ పదార్థాలు మూత్రంలో విసర్జింపబడతాయి. ఒక రోజులో దాదాపు 1.5 లీటర్ల మూత్రం తయారౌతుంది.

శరీరంలో ఒక్క వ్యవస్థ ఇంత సమర్థవంతగా, ఇన్ని పనులు మన ప్రమేయం లేకుండా చేయడం అన్నది ఒక అద్భుతం. ఇంతంటి అద్భుతమైన వ్యవస్థను దేవుడు మనకు ఉచితంగా ఇచ్చినందుకు దేవుని పట్ల కృతజ్ఞత కలిగి జీవించడంతో పాటు ఆయన ఇచ్చిన ఆరోగ్యాన్ని మంచి ఆహారాపు అలవాట్లతో కాపాడుకుందాం. ఆరోగ్యంగా జీవిద్దాం!

ఆధునిక దృక్పథం

క్రొత్త కోణాలు

# 6. ధన్యతలు - సాత్వీకం - భూస్వాస్థ్యం

**"సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు"**

**Blessed are the meek; for they shall inherit the earths KJV.**

**భూలోక మానవ చరిత్ర యావత్తులో బలవంతులే కామందులు (The Mighty are the Masters) ఒక సర్వసత్యం. బలం కండబలం, దండబలం, ఖడ్గబలం, పరాక్రమంలతో ముడిబడిందేగాని, మెతకదనం సాధుగుణాలతో ఎవ్వరూ భూస్వాస్థ్యాన్ని పొత్తుపెట్టరు. అయితే, సాత్వీకులు ధన్యులు, వారు భూలోకానికి వారసులౌతారనేది సర్వసమంజస ఆలోచన కానేరదు. మరి క్రీస్తు దీన్ని క్రొత్తకోణాల్లో తెల్పాడు.**

ధన్యతల్ని చదువుతుంటే, ప్రతిదీ విడ్డూరంగా అని పిస్తుంది. ప్రతిదీ బల్లల్ని తల్లక్రిందులు చేస్తున్నట్లుంటుంది. అసలు, క్రీస్తు చెప్పిన ప్రతిమాట స్వాభావిక లోకజ్ఞానానికి పెడద్రంగా, అతీతంగా ఉంటుంది. నిజమే! అపో. 17:6 (b)లో – థెస్సలొనికయలో యేసుబోధలను చెప్పుచుండిన కొందరు సహోదరులను, 'భూలోకమును తల్లక్రిందులు చేసిన (that turned the world upside down) వారు....' అని క్రీస్తును వెంబడించిన వారినే అంటే, వారి గురువైన క్రీస్తు యింకెంత తల్లక్రిందులు చేసి ఉంటాడనుకోవాలి. నా దృష్టిలో క్రీస్తు ఒక విప్లవం, తీవ్ర వాదం. అది కండ బలంతోగాని, దండబలంతోగాని, (ఈనాటి) తుపాకి గుండు బలంతోగాని కూడింది కాదు. శాంతి సమాధానాలు, దీనత్వం సాత్వికాలు, జాలి కరుణలతో కూడింది. అంటే, ఆనాటికీ ఈనాటికీ క్రియా సాధనలలోనే మౌలిక మార్పుగల నిర్వచనా లిచ్చిన దేవ– మానవుడు క్రీస్తు. ఒక బుద్ధుడు, ఒక గాంధీ అప్పుడప్పుడు ఈ భూమిని తల క్రిందులు చేసే సూత్రాలను ప్రవేశపెట్టారు. అయితే, క్రీస్తు యిహపరాలకు కూడ వర్తించే తల్లక్రిందు తత్వాన్ని బోధించి సాధించి, తనకు తాను సిలువపై వధింపున కొప్పుకొనిన లోకరక్షకుడు, ప్రభువు. ఈయనకే మానవుడు సముడు కాదు.

**సాత్వీకం – స్వతంత్రించుకొనటం:** అక్షరార్థంగా, సాత్వికం అంటే సత్వగుణం వల్లకలిగేది. సత్వమంటే 'సత్తా', 'దేహబలం' అనే అర్థాలతోపాటు సత్యం, రజస్సు, తమస్సు అనే గుణత్రయంలో ఒకటి. వీనిని గుణాలనేకాక శక్తులని కూడ మనవారు అంటారు. అలానే, 'స్వతంత్రించు' (ఇంగ్లీషు బైబిల్లో, inherit గ్రీకు మూలంలో క్లేరోనోమియో') అంటే సొంతం చేసుకొను, ఒక వారసునిగా స్వంత ఆస్థి (స్వాస్థ్యం)గా సొంతం చేసుకొనటమని. కాని, మనం వాడే భాషలో 'సాత్వీకం' అనేది ఎముకలేని మెత్తదనానికి మాటగా ఉంటుంది. సద్దుమణిగి ఉండి సర్దుకుపోయే చవటతనానికి, అస్వతంత్ర స్వభావానికి, మనస్తత్వానికి వాడుతాం. నేటి కాలమాన పరిస్థితుల్లో 'సాత్వికం' కనీసం ఒక ఆదర్శగుణం (virtue) కాకపోగా కేవలం చేతగాని తనానికి, బలహీనతకు సరిపెడతాం. కనుక, సాత్వీకం ఒక ధన్యత అని గాని, ఆ గుణం కలవారు భూలోకాన్ని కాదు గదా తమ స్వంత కుటుంబంలోగాని, సమాజంలోగాని అంగుళం స్థలం కాని, పదవిగాని, పెత్తనం గాని సొంతం చేసుకోలేరని మన స్వాభావిక అవగాహన. కనుక, యేసు ఈ పరలోక రాజ్యసూత్రాన్ని బోధించటంలో తప్పని సరిగా ఒక మర్మం, అంతర్థాం, అదే ఒక క్రొత్తకోణం ఉండాలి. దాన్ని అర్థం చేసుకోనేందుకు ప్రయత్నిద్దాం.

1.గ్రీకుమూలంలో 'ప్రావుటేస్' (prautes) మెతకదనం, దీనత్వం, సాత్వికం అనే అర్థాలున్నాయి. దీన్ని గ్రహించ డానికి మొదట విశ్వవిఖ్యాత గ్రీకు తత్త్వవేత్త అయిన అరిస్టాటిల్ (Aristotle) పద్ధతిని పరిశీలిద్దాం. అరిస్టాటిల్ ప్రతి ఆదర్శ గుణాన్ని (virtue) రెండు అత్యంత విరుద్ధాల (extremes) మధ్యస్థ (middle) గుణంగా నిర్వచించేవాడు. దానినే సువర్ణ మధ్యస్థసూత్రం (The principle of the golden mean) అంటారు. ఉదాహరణకు, ఒక చిట్టచివర దూబారాతనం ఉంది. దానికి వ్యతిరేకంగా మరో చిట్టచివర పీనాసితనం ఉంది. ఈ రెండింటి మధ్యస్థంగా ఉండేది 'వదాన్యత' (generosity) అనేది (బంగారు మధ్యస్థం) ఒక

ఆదర్శగుణం అవుతుంది.

అలానే, ఒక చిట్టచివర రౌద్రం, క్రోధం, క్రౌర్యం మొదలైన అత్యంతమైన కోపాన్ని చూపించే గ్రీకుమాట 'ఆర్యులోటేన్ (argulates) అనేది ఉంది. ఈ మాటకు కారణంలేని కోపం అని అర్థం. రెండోచిట్టచివరి అసలు కోపమునేదే లేని సాధుత్వం ఆవోర్గేషియ' (aorgesia) ఉంది. నోటిలో వ్రేలుపెట్టినా కొరకనంత పసిమృదుత్వం, కోమలత్వం, సంపూర్ణ కోపరాహిత్యం అన్నమాట. ఈ రెండు పరస్పర విరుద్ధాల మధ్యస్థంగా ఉండేది ప్రావోటేస్' (praotes) అనే మాటకు తర్జుమా అయిన సాత్వికం. ఇది ఒక ఆదర్శగుణం (virtue). దీనిని బట్టి సాత్వికునికి కోపమనేది ఉండనే ఉండదనికాదు. అయితే, ఈ ఆగ్రహం సరియైన సమయ సంధర్భాల్లో, సకారణంగా, సరియైన కొలమానంలో ఉండేదన్న మాట.

మన స్వంత అనుభవంలో, గాంధీజీ నాన్- వయొలెన్స్ (non-violence) సిద్ధాంతం కనిపెట్టారు. దీనికి తెలుగులో వాడినమాట, బహుశ ఆ సిద్ధాంతానికి సమీపార్థమిస్తుంది. నాన్-వయొలెన్స్ అంటే 'అహింస'. తెలుగులో అది 'సత్యాగ్రహం'. ఆగ్రహమే కానీ సత్యమైన ఆగ్రహం అని.

యేసు 'ఆగ్రహం' ఏదో ఒక మేరకు చూపిన ఘట్టాలు బట్టబయలుగా కన్పించేవి ఉన్నాయి: తన తండ్రి గృహాన్ని దొంగల గుహగా చేసిన వారిని కొరడాలతో కొట్టి తరిమిన రెండు ప్రక్షాళనా ఉదంతాలు (యోహాను. 2:13-17, మరియు మత్తయి 21:12-16; మార్కు- 11:15-19: లూకా 19:45-48); అదే విధంగా యోహాను 18:23లో తనను అరచేతితో కొట్టిన బంట్రౌతుతో, 'మంచిమాట ఆడిన యెడలనన్నేల కొట్టు చున్నావ'ని సత్యాగ్రహం చూపినాడు!

కనుక, సరియైన సందర్భంలో తప్పక కోప్పడుతూ, సరికాని సందర్భల్లో ఎప్పుడూ కోప్పడనివాడు ధన్యుడు. మరి సరియైన సందర్భం ఏది! మన స్వంతానికి వాటిల్లే ఎంత అపకారంలోనైనా కోప్పడటం సరికాదు అయితే, ఇతరుల విషయంలో, దేవుని విషయంలో, సత్యం విష యంలో అసహనం (కోపం) చూపటం అన్ని సందర్భాల్లో సరియైనదే అవుతూంది. స్వార్థంతో కూడిన కోపం పాప మౌతుంది, పరోపకార్థమైన అసహనం ప్రపంచాన్ని నడిపించే నైతిక చలనశక్తి కాగల్గుతుంది.

2. 'ప్రావూటేస్' అనే మాటకు సంబంధించి 'ప్రావూస్' అనే మరొకమాట సాత్వీకాన్ని సూచిస్తుంది. ఇది మచ్చిక చేయబడ్డ జంతుజాలానికుండే స్వభావాన్ని సూచించేమాట. అంటే, ఆ జంతువు చేష్టలు దాని కళ్ళెం లేక పగ్గాలు పట్టుకొన్న వాని నియంత్రణ (control) లోఉంటాయి. వాస్తవానికి ప్రతి సహజాతం (instinct), ప్రేరణ (impulse), అభిలాష (passion) లలో సంపూర్ణ స్వయం స్వాధీనంలో గల మానవుడు ధన్యుడనవచ్చు. భగవద్గీత 2వ సర్గ 62,61 శ్లోకాల్లో ఇలా ఉంది.

క్రోధాత్భవతి సంమ్మోహః, సమ్మోహత్ స్మృతివిభ్రమః
స్మృతిభ్రంశత్ బుద్ధినాశః, బుద్ధి నాశతే ప్రాణాశ్యత్

అంటే, క్రోధం చిత్తభ్రమ కల్గిస్తుంది, చిత్తభ్రమ మనోభ్రాంతి కల్గిస్తుంది, మనోభ్రాంతి బుద్ధిని నాశనం చేస్తుంది, బుద్ధి నాశనం ప్రాణాలు తీస్తుంది అని. అందుకే-

తాని సర్వాణి సమ్యమ్య యుక్తః అసీత మత్పరః
వశేహియాశ్యేంద్రియాణి తస్యప్రజ్ఞా ప్రతిష్టితా।

అంటే,యోగియైనవాడు ఇంద్రియాలన్నింటిని నియంత్రించు కొన్నవాడై, భగవంతుడే అత్యున్నతమైన గురిగా గల వాడగును.ఎవడు కామక్రోధ లోభ మోహమదమాత్సర్యాలను స్వాధీనం చేసుకొంటారో అట్టివాని జ్ఞానం స్థిరమై యుంటుందని.

అయితే, బైబిలు దీనితో ఏకీభవించదు. ఏ నరజన్ముడు కూడ తనంతట తాను తన ఇంద్రియాలను సంపూర్ణంగా స్వాధీనం చేసుకొనలేడు. కనుక, మనిషి దైవ స్వాధీను డైనప్పుడే అతనికి ధన్యత కల్గుతుంది. దేవుని నియంత్రణలో స్వామి చిత్తాన్ని నెరవేర్చుటలోనే మన సంపూర్ణ స్వాతంత్ర్య స్వాస్థ్యాన్ని కనుగొంటాం.

3.గ్రీకులో హుప్సెలోకార్డియ (hupselckardia) అంటే విశాలహృదయం అనే అర్థమిచ్చే మాటకు, సాత్వీకమనే అర్థమిచ్చే 'ప్రావూటేస్' అనే మాటకు నాణ్యతలో కొంత భేదం ఉంది. సాత్వీకంలో నిజమైన దీనత్వం, గర్వం, అహంకారాలను పారద్రోలే దీనత్వం అమరి ఉంది.

దీనమనస్సులేనిదే ఒక మనిషి నేర్చుకోలేడు. నేర్చుకొన టానికి మొట్టమొదటి మెట్టు మన అజ్ఞానా (ignorance)

న్ని గుర్తించాలి. అందుకే, 'యెహోవాయందు భయభక్తులు గలిగి యుండుటయే జ్ఞానమునకు మూలము' (సామె. 9:10) అని బైబిలు చెప్తాంది. స్థితప్రజ్ఞుడైన విద్యార్థికెవ్వరూ ఏది నేర్పించలేరు. మన స్వంత నిస్సహాయతను గ్రహించటం, దేవుని సహాయావసరతను గుర్తెరగటంలోనే మొదలౌతుంది. ఎంతైనా మనిషి సృష్టింపబడిన వాడు; దేవుడు సృష్టికర్త. సృష్టికర్త సహాయం లేనిదే సృష్టమైన మానవుడు సంపూర్ణత (perfection) పొందలేడు. కనుక, తన స్వంత అజ్ఞానాన్ని, నిస్సహాయతను తెలుసుకొని దేవుని నియంత్రణలోనికి ప్రవేశించగల మనిషే ధన్యుడు.

సంఖ్యా. 12:3లో మోషే భూమి మీదనున్న వారందరిలో మిక్కిలి సాత్వీకుడు' అని ఉంది. ఒకవేళ మాటకారిని కాదని దేవునితో నీళ్ళు నమిలి ఉండొచ్చు. అంతమాత్రాన అతడు బలహీనుడుకాదు. ఐగుప్తు సకల విద్యలు (యుద్ధవిద్యలతో సహా) నేర్చినవాడు. తన స్వహస్తాలతో బలమైన ఐగుప్తీయుని చంపగలిగినంత బలశాలి. వ్రేలు జుబికే అమాయకుడు కాదు - వెన్నెముక లేని పిరికివాడు కాదు, అతని కోపం అగ్నిజ్వాలలా ఆశనిపాతంలా ఝుళిపింపగల్గిందే,

"పరాక్రమశాలికంటే దీర్ఘశాంతముగలవాడు శ్రేష్టుడు పట్టణమును పట్టుకొను వానికంటె తన మనస్సును స్వాధీన పచుకొనువాడు శ్రేష్టుడు" సామెతలు 16:32

అలాంటి నియంత్రణలేని కారణంగా అలెగ్జాండర్ వంటి మహాపరాక్రమశాలి ఒకసారి తప్పతాగిన మైకంలో అదుపు చేసుకోలేని కోపంలో తనకత్యంత ప్రియుడైన స్నేహితుని మీదకు బళ్ళెం విసిరి నిలువునా ప్రాణాలు తీశాడు. కనుక, సాత్వికుడంటే బలం, పరాక్రం కలిగియున్నా లేకున్నా సరియైన సమయ సందర్భాలన్నింటిలో కోపం చూపిస్తూ, ప్రతి విషయంలోనూ నియంత్రణ కలిగి తన సర్వస్వాన్ని దేవుని నియంత్రణకు లోనుచేస్తూ, తన అజ్ఞానాన్ని నిస్సహాయతను గ్రహించి దేవునిపై సంపూర్ణంగా ఆధారపడగల్గిన వాడని, అటువంటి సాత్వీకుడు ధన్యుడు. అతడు భూమిని స్వాస్థ్యంగా పొందగలడు.

వచ్చే మాసం:
**నీతికోసం తృష్ణ - ధన్యతైన తృప్తి**


## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | ఆసెనతు | రూ. 150 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 5. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యధార్ధ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |
| 31. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# కృపాదానం

కృపాదానం 48 సం॥ల వయస్సులో 1960 జనవరి 30న 13వ సంతానంగా మగపిల్లవానిని కన్నాడు. ఆ సంవత్సరం ఒంగోలులో నవంబరు 14వ తారీకున బాలల దినోత్సవంలో మెడికల్‌గా ఆరోగ్య వంతుడైన శిశువుగా ఆ బాలునికి స్థానిక రెడ్‌క్రాస్ మందిరములో డాక్టర్లు నిర్ధారణ చేసి కృపాదానంగారి 13వ బిడ్డ అని పెద్ద ఫోటో దిన పత్రికలో ప్రచురించారు. ఇప్పుడు ఆ బిడ్డ జాన్‌మార్కు ఒంగోలుకు 20 కిలోమీటర్ల దూరంలో క్రొత్తపట్నం దగ్గర ఉన్న ఆకుతోటల కాలనీలో ప్రభువు సంఘం నడిపిస్తున్నాడు. కుటుంబ నియంత్రణ పాటించే వారందరు దేవుని మాటకు వ్యతిరేకులని చెప్తుండేవాడు.

1987వ సంవత్సరం ఆయన పరమునకు పిలువబడే సమయానికి ఆయన సంతానం అంతా ఏదో విధముగా ప్రభువు సేవలో ఉన్నారు. నాడు ఆయన మునిమనుమలతో కలిసి కుటుంబ సంఖ్య 146 మంది. 3 అనాధ శరణాలయములు వివిధ గ్రామాలలో నెలకొల్పి పోషించిన అనాధుల సంఖ్య వేలలోనే ఉంటుంది. ఆయన స్థాపించిన పాఠశాలలో గవర్నమెంటు వారి ఎయిడెడ్ పాఠశాల ఉండినది. ఆయనకి పెండ్లయిన క్రొత్తలో తన పెద్ద కుమారుని మాత్రము సేవకునిగా ప్రతిష్ఠించాడు. తరువాత కాలంలో ఆయన 12 మంది పిల్లలు సేవకులుగా ప్రతిష్ఠించబడ్డారు.

రెండు పట్టణాలలో ఉచిత వైద్యము అందించుటకుగాను ఆస్పత్రులు స్థాపించి, నర్సులను ఏర్పరచి అమెరికా నుండి దిగుమతి అయిన మందులతో ఉన్నత వైద్యము అందించారు.

తన సేవకు సమర్పించు కొనిన వారు ఈ లోకములో ఎన్నిక లేనివారైనందున లోకములో నివశించే అధికారులు వారిని హీనపరచి, బాధించడం వారి అధికారాన్ని అబద్ధాలతో మేళవించి సువార్తికులను వేధించడం అపొస్తలుల కార్యముల నుండి మనము చూచుచున్నాము. ఈ విషయాన్ని ప్రభువు ముందుగానే తన శిష్యులకు హెచ్చరిక చేశాడు. అయినను భయపడకుడి నేను లోకమును జయించి యున్నాను అన్నాడు.

ఆ విధంగానే కృపాదానంను నాశనము చెయ్యాలని నాటి అధికారులు ఎన్నో కుట్రలు చేశారు. కాని కాలక్రమములో వారంతా సిగ్గుపడి ఈ లోకంను వదలిపెట్టి వెళ్ళారు. దానికి 80 సం॥ల వయస్సు గల నేనే సజీవ సాక్షిని.. కాని కృపాదానంగారు అతి నిదానంగా ప్రశాంతముగా తన వారందరు తనతో ఉండగా ప్రభువును చేరారు. తన సేవకులను హింసించిన వారిని కూడా దేవుడైన ప్రభువైన యేసు ప్రేమించి వారి కొరకు కూడా శిలువలో తన రక్తము కార్చినందువలన తాత్కాలికంగా వారి మారుమనస్సు రక్షణకై ఎదురు చూస్తున్నాడు.

కృపాదానంగారు తనను హింసించిన వారి కొరకు ప్రార్థించేవాడు. సంఘాన్ని ప్రార్థించమని కోరేవాడు. ఆయన భార్య శ్రీమతి హన్నమ్మగారు ఆయన కంటే అయిదు సంవత్సరములు ముందుగా ప్రభువును చేరారు.

ఈ లోకంలో మనుష్యులకు తోటి వారిలో తారతమ్యాలు, బేధాలు, వివక్షత ఉంటాయి. కాని దేవునికి అందరూ ఒక్కటే. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను.

కాని మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడా సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము. క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల క్రీస్తుతోడి వారసులము. రోమా 8:16,17

సహోదర ప్రేమ విషయములో ఒకనియందొకడు అనురాగము గలవారై, ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి. ఆసక్తి విషయములో మాంద్యులు కాక, ఆత్మయందు తీవ్రతగలవారై, ప్రభువును సేవించుడి.

నిరీక్షణ గలవారై సంతోషించుచు, శ్రమయందు ఓర్పుగలవారై, ప్రార్థనయందు పట్టుదల కలిగియుండుడి. రోమా 12:10-12

1960లో మచిలీపట్టణంలో జరిగిన యూత్ రిట్రీట్‌కు హాజరయ్యాను. అక్కడ ఒక మిషనరీతో మాట్లాడుతూ మాటల సందర్భములో మా తండ్రిగారికి మేము 12 మంది సంతానము అని చెబితే ఆయన ఆశ్చర్యపోయి అసంతృప్తిగా మాట్లాడారు. అంతమంది సంతానం ఈ కాలంలో అవసరమా? అని అన్నాడు. కాలానికి, సంతానానికి సంబంధం ఏమిటి? కాలమునుబట్టి బైబిలు మారలేదు, ప్రభువు మారలేదు కదా! భూమిని నింపమని ప్రభువు చెప్పాడు కదా! ఒకవేళ భూమి నిండిపోతే దానిని సృష్టించిన ప్రభువు దానిని మరలా వ్యాపింప చేసి భూమిని ఇంకా పెద్దదానిగా చేయగలడు. అయినా ఇప్పుడు మానవులు భూమిని నిండించే ప్రయత్నంలో లేరుగా! అపార్టుమెంటులు కట్టి భూమిని నిండకుండా చేస్తున్నారు అన్నాను. అంతేకాకుండా దేవుడు కుమారులను మనుష్యులకు స్వాస్థ్యముగాను, మనుష్యులకు బహుమానంగా గర్భఫలము ఇస్తున్నాడు. ప్రతి మానవుని కొరకు దేవుడు తన రక్తాన్ని కార్చాడు. దేవుని శక్తికి పరిమితిని నియమించే శక్తి, జ్ఞానము మనుష్యునికి లేదు. మనిషి జీవించినంత కాలము విశ్వాసమే ఊపిరిగా జీవించాలి. మనలను పుట్టించిన దేవునికే పెంచి పోషించే బాధ్యత ఉన్నది. ఆయన బాధ్యతలను మనం ఆయనకు జ్ఞాపకం చెయ్యనవసరం లేదు.

కాబట్టి మానవులు సాతాను ప్రేరణ వలన పండు తినిన తర్వాత శరీర కోరిక జన్మించి (పాపము అనుకొని) బిడ్డలు కలిగారను మాట నూటికి 99 మంది నమ్ముతారు కాని, ఆదికాండము 1:28 ప్రకారము ఆ క్షణాన్నుంచే బిడ్డలను కని ఆశీర్వాదము పొందారని వారు పండు తినుటకు ముందు మరణము లేనందున పండు తిను నాటికి వారి సృష్టి జరిగి ఎన్ని సంవత్సరాలు జరిగాయో మనకు తెలియదు కదా!

**(సశేషం)**

**(21వ పేజీ తరువాయి)**

నడిపించడానికి ఒక భక్తిగల దైవజనుడు అవసరం. అలాంటి వారు ప్రస్తుతం ఇశ్రాయేలీయులలో ఎవరూలేరు. అందుకే ఒక భక్తి గలవాడు జన్మించాలి. అలాంటి వానిని గర్భమున మోసి, కని ఉగ్గుపాలతోనే భయభక్తులను నూరి పోయగలిగిన తల్లి కొరకు దేవుడు వెదికాడు. హన్నాను కనుగొని ఆమెను శ్రమలతో సరిచేసి సవరించి, తన కుమారుని దేవునికి సమర్పించగల తల్లిగా ఆమెను తయారు చేశాడు. బంగారాన్ని శుద్ధిచేసినట్లు ఆమెను అగ్నిలో కాల్చాడు. పెనిన్నా విసిగించినపుడు ఆమె చూపిన ఓర్పు, సహనం, ప్రార్థనలో ఆమె భక్తి, విశ్వాసం - ఏలీ నిందించినపుడు ఆమె వినయము, విధేయత, బిడ్డను సమర్పించడంలో ఆమె త్యాగమూ, కృతజ్ఞత దేవుడు ఆమెకు ఇచ్చిన శిక్షణకు ప్రతిఫలాలు. ఈ సుగుణాలనే సమూయేలుకి నూరిపోసింది. నరనరాల్లో ఆమె జీర్ణించి పోసిన ఈ సుగుణాలు పాలు మాన్పించువరకు "ఉగ్గు"తో పోసింది. సమూయేలును ఒక గొప్ప ప్రవక్తగా, ఇశ్రాయేలీయులను నడిపించువానిగ, రాజును అభిషేకించు వానిగ దేవుడు ఏర్పరచుకొన్నాడు. చిన్న వయసులోనే యెహోవా స్వరమును వినగలిగాడు (3:4-14) గొప్ప ప్రార్థనా పరుడు (12:23) గొప్ప విశ్వాస వీరుడు (హెబ్రీ 11:32) కాగలిగాడు.

ఇలాంటి గొప్ప ప్రవక్తను కనిన వనిత హన్నా. శ్రమలలో కృంగిపోక ఎన్నో సుగుణాలు నేర్చుకోగలిగిన వనిత హన్నా. మనకు శ్రమలు కలిగినపుడు ఏదో ఒక వింత సంభవించినట్టు ఆశ్చర్యపోక క్రీస్తు శ్రమలలో పాలివారై నంతగా సంతోషించాలి. (1పేతురు 4:12,13) తన నిత్యమహిమకు క్రీస్తునందు మిమ్మును పిలిచిన సర్వకృపా నిధియగు దేవుడు కొంచెము కాలము శ్రమపడిన తరువాత తానే మిమ్మును పూర్ణులనుగా చేసి స్థిరపరచి బలపరచును (1పేతు 5:10) హన్నా అలాగే స్థిరపడి బలపడి ఒక గొప్ప ప్రవక్తను దేవుని సేవకు అందించగలిగింది. దేవుని వాక్యంలోని ఈ వనిత సుగుణాలను గ్రహించి దేవుని సేవకు ఎలా తోడ్పడగలమో నేర్చుకోవడం అవసరం కదా! స్త్రీలకు హన్నా ప్రార్థనా జీవితం ఆదర్శం.

స్త్రీల విభాగం

# హన్నా

ఎఫ్రాయిము మన్యమందు రామతయిమ్సోఫీము పట్టణపు వాడైన ఎల్కానా అను ఒకనికి ఇద్దరు భార్యలు. వారి పేర్లు హన్నా, రెండవదానిపేరు పెనిన్నా. హన్నాకు పిల్లలు లేరు. ఆమె గొడ్రాలు. అందుకే పెనిన్నా ఆమెను ఏదో విధంగా కించపరుస్తూ ఉండేది. ఇది సాధారణంగా లోకంలో జరిగేదే. పిల్లలు లేని వారిని లోకం ఎన్ని మాటలంటుందో స్త్రీలకే కాదు పురుషులకూ తెలిసిన విషయం. అలాంటి సందర్భంలో ఆ స్త్రీ ఎంత బాధకు లోనవుతుందో చెప్పనలవికానిది. ఆవంకా ఈవంకా పెట్టి ఏదో విధంగా సూటిపోటి మాటలనడం. దానిని సహించ లేక ఆ గొడ్రాలు ఏదో ఒకటి తిరిగి అనడం పెద్ద పెద్ద గొడవలైపోవడం మామూలే! ఒకే ఇంట్లో ఉన్న ఇద్దరు భార్యలున్న చోట ఇక చేప్పేదేముంది? కాని ఎల్కానా ఇంట్లో హన్నా – పెనిన్నాల మధ్య ఏ గొడవ జరిగినట్లు కనబడదు. ఎందుకంటే అది హన్నా ఓర్పు – సహనం. తన వైరియగు పెనిన్నా ఆమెను ఎన్ని మాటలన్నా "భోజనం చేయక ఏడ్చుచు" వుండడం తప్ప ఒక్క మాట ఆమెను తిరిగి అన్నట్టు కనబడదు. సాధారణంగా చిన్న చిన్న విషయాలకు కూడా పెద్ద పెద్ద గొడవలు పెట్టుకోవడం స్త్రీలకు మామూలు. పెనిన్నా నిత్యము విసిగిస్తూ కోపము పుట్టిస్తూ ఏదోవిధంగా గొడవ పెట్టాలని చూసినా హన్నా ఏడవడం తప్ప మరోమాట అనేది కాదు. రెండు చేతులూ కలిస్తేనే కదా చప్పట్లు!!

ఎల్కానా చాలా భక్తిగలవాడు. అతడు షిలోహు నందున్న మందిరమునకు సైన్యములకధిపతియగు యెహోవాకు మ్రొక్కుటకును బలి అర్పించుటకును ఏటేట తన పట్టణము విడిచి తన కుటుంబముతో కలిసి వెళ్ళడం అలవాటు (1సమూ. 1:3) అతడు భక్తి గలవాడు గనుకనే కలహము పెంచాలనుకునే పెనిన్నా కంటే ఓర్పు సహనం గల హన్నానే ఎక్కువ ప్రేమించేవాడు. అతని ఓదార్పు మాటలు హన్నాకు ఎంతో ధైర్యాన్నిచ్చేవి. ఎల్కానా షిలోహులో తాను బల్యర్పణ చేసిన రోజు తన భార్యయగు పెనిన్నాకును ఆమె కుమారులకు, కుమార్తెలకు పాళ్ళు ఇచ్చుచు వచ్చెను గాని హన్నా తనకు ప్రియముగా ఉన్నందున ఆమెకు రెండు పాళ్ళు ఇచ్చెను (1:4,5) ఆమె ఓర్పు, సహనం, వినయం, విధేయత తన భర్త దగ్గర రెట్టింపు ప్రేమను పొందడానికి కారణం అయ్యాయి.

"హన్నా, నీవెందుకు ఏడ్చుచున్నావు? నీవు భోజనము మానుటయేల? నీకు మనో విచారమెందుకు కలిగినది? పదిమంది కుమాళ్ళ కంటె నేను నీకు విశేషమైన వాడను కానా?" (8వ) అని ఆమె భర్త అనిన మాటలు ఆమెకు ఎంతో ఓదార్పు, ధైర్యము కలిగించి వుంటుంది. భర్త ఎంతగా ఓదార్చినా పెనిన్నా మాటలు మనసులో కలుక్కుమంటూనే ఉన్నాయి. ఆమె కుమిలిపోయింది.

ఒకసారి ఎల్కానా కుటుంబంతో యెహోవాకు మ్రొక్కుబళ్ళు చెల్లించడానికి షిలోహుకు వెళ్ళాడు. అక్కడ మ్రొక్కుబళ్ళు చెల్లించి, అన్నపానాదులు కూడా పుచ్చుకొన్న తర్వాత హన్నా ఒక్కతే యెహోవా మందిరంలోకి వెళ్ళింది. యాజకుడైన ఏలీ, మందిర స్థంభము దగ్గర ఆసనము మీద కూర్చుని వున్నాడు. పెనిన్నా మాటలతో గాయపడిన హన్నా బహు దుఃఖ్రాంతురాలై యెహోవా సన్నిధిని ఏడుస్తూ ప్రార్థన చేయడం మొదలు పెట్టింది. ఆమె పెదవులు కదలుతున్నాయి గాని స్వరం మాత్రం వినబడడంలేదు.

"సైన్యములకధిపతియైన యెహోవా, నీ సేవకురాలనైన నాకు కలిగియున్న శ్రమను చూచి, నీ సేవకురాలనైన నన్ను మరువక జ్ఞాపకముచేసుకొని, నీ సేవకురాలనైన నాకు మగపిల్లను దయచేసిన యెడల అతని తలమీదికి క్షౌరపు కత్తి యెన్నటికి రానియ్యక, అతడు బ్రతుకు దినములన్నిటను నేను అతనిని యెహోవావగు నీకు అప్పగింతునని మ్రొక్కుబడి చేసుకొనెను" (1:11)

ఆమె యెహోవా సన్నిధిలో నిట్టూర్పులు విడుస్తూ, ఏడుస్తూ ప్రార్థిస్తూ వుంటే ఏలీ ఆమెను చూస్తూ ఆమె నోరు కనిపెడ్తూనే వున్నాడు. ఆమె స్వరము వినబడలేదు గనుక

ఆమె మత్తురాలై ఉందనుకొన్నాడు. "ఎంత వరకు మత్తురాలవై ఉంటావు, ద్రాక్షారసం నీ దగ్గర నుండి తీసివేయుము" అని (16వ) చెప్పాడు.

"అది కాదు నా యేలినవాడా, నేను మనో దుఃఖము గల దాననైయున్నాను. ద్రాక్షారసమునైనను, మద్యమునైనను పానము చేయలేదు గాని నా ఆత్మను యెహోవా సన్నిధిని కుమ్మరించుకొనుచున్నాను. నీ సేవకురాలనైన నన్ను పనికి మాలినదానిగ యెంచవద్దు" (15) అని వేడుకొంది.

ఆమె గొడ్రాలైనందున అందరూ ఆమెను గూర్చి ఏమనుకొంటున్నారోననే వేదనకు తోడుగ ఆమె వైరియగు పెనిన్నా ఆమెను విసిగిస్తూనే కోపము పుట్టిస్తుంది. ఇప్పుడు ఏలీ ఆమెను మత్తురాలవై యున్నావు అన్నాడు. ఆమె మరింత అవమానం పొంది వుంటుంది. ఆమె ఈ వేదనలతోనే కుమిలి, కృంగి, విరిగి నలిగిపోయి వుంటుంది. ఆమె ఎవరినీ ఏమీ అనలేదు గాని ఆమె తన ఆత్మను యెహోవా సన్నిధిని కుమ్మరించుకుంది. ఎంతో వినయముతోను, విధేయతతో 'నీ సేవకురాలనైన, నీ సేవకురాలనైన, నీ సేవకురాలనైన' అంటూ యెహోవాను వేడుకొంది. ఏలీ మాటలతో ఆమెకు ఎంతో కోపం రావలసియుండగా "అది కాదు నా యేలిన వాడా" అంటూ మరింత తనను తాను తగ్గించుకోవడం ఆమె వినయ విధేయతలకు ప్రతీక. విరిగి నలిగిన హృదయమును దేవుడు అలక్ష్యము చేయడు కదా (కీర్త 51:17) ఆమె కృంగిపోక, కోపము తెచ్చుకోక చాలా వినయముతో "నీ సేవకురాలినైన నన్ను పనికిమాలిన దానిగ ఎంచవద్దు" అని నెమ్మదిగా చెప్పుకొంది. ఒకవేళ ఆమె కోపగించి యాజకుడైన ఏలీని ఏమైన అని వుంటే ఎలా వుండేదో గాని ఆమె వినయ విధేయతలే ఆమెను దీవించ డానికి కారణమైంది.

"నీవు క్షేమముగా వెళ్ళుము. ఇశ్రాయేలు దేవునితో నీవు చేసుకొనిన మనవిని ఆయన దయచేయును గాక!" అని ఏలీ ఆమెను దీవించాడు. (1:17) నీ సేవకురాలనైన నేను నీ దృష్టికి కృపనొందుదునుగాక అని మరోసారి వినయముతో ఆయనకు సమాధానమిచ్చింది.

"నాట నుండి ఆమె దుఃఖముఖిగా నుండుట మానెను" అన్న వాక్యం ఆమె విశ్వాసాన్ని సూచిస్తుంది. తన ప్రార్ధన దేవుడు ఆలకించి తప్పక , అడిగిన దానిని దయచేస్తాడని నమ్మినందువలనే ఆమె భోజనము చేయుచు దుఃఖముఖిగా నుండుట మానగలిగింది. (1సమూ 1:18)

మరియు మీరు ప్రార్ధన చేయునపుడు వేటిని అడుగుదురో అవి దొరికినవని నమ్మిన యెడల మీరు వాటినన్నిటిని పొందుదురని మత్త 21:22లో వుంది.

హన్నా అంత గొప్ప విశ్వాసంతో నమ్మింది గనుకే ఆమె ముందుగానే దుఃఖముఖిగా నుండుట మానివేసింది. ఎంత గొప్ప విశ్వాసం! ఆమె ఓర్పు, సహనమూ, వినయమూ – విధేయత, విశ్వాసమూ, నిబ్బరమూ ఆమెకు గొప్ప ప్రతిఫలాన్నిచ్చింది. దేవుడు ఆమెను జ్ఞాపకం చేసుకోవడం వల్ల గొడ్రాలైన హన్నా గర్భము ధరించి కుమారునికి జన్మనిచ్చింది. అతనికి సమూయేలు అని పేరు పెట్టింది. ఆ బిడ్డ పాలు విడిచే వరకు మాత్రమే తన కౌగిట వుంచుకొంది. తరువాత తను యెహోవాకు మ్రొక్కుకొనిన రీతిగ అతడు చిన్నవాడై యుండగానే షిలోహు మందిరానికి తీసుకొని వచ్చి యాజకుడైన ఏలీకి జ్ఞాపకం చేసింది. "ఆ రోజు ప్రార్ధన చేసిన స్త్రీని నేనే. ఈ బిడ్డను దయచేయమని యెహోవాతో చేసిన మనవిని విని ఆయన నాకనుగ్ర హించెను. కాబట్టి నేను ఆ బిడ్డను యెహోవాకు ప్రతిష్టించు చున్నాను" (1:26-28) అని ఆ బిడ్డను ఆ చిన్న వయసు లోనే ఆ మందిరంలో వదిలివేసింది. ఒక తల్లి తన చిన్న బిడ్డను తన ఒడిలో నుండి తీసి ఒక క్రొత్త ప్రదేశంలో వదిలి వేయడం అనేది ఎంతో త్యాగంతో కూడిన విషయం. ఆ బిడ్డను పూర్తిగా వదిలి తిరిగి తన ఊరికి వెళ్ళిపోయింది. తన మ్రొక్కుబడి తీర్చుకొంది. మాట తప్పలేదు. అందుకే దేవుడు ఆమెకు ఆ దిగులు లేకుండ మరొక ముగ్గురు కుమారులను, ఇద్దరు కుమార్తెలను ఇచ్చాడు (21). గొడ్రాలిని సంతుగల తల్లిగా చేశాడు.

ఆ దినములలో ఇశ్రాయేలీయులకు రాజు లేదు. దేవుని భయం కూడా లేకుండా ప్రతివాడు తన ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు (న్యాయా 21:35) ఇలాంటి ప్రజలను

**(మిగతాది 19వపేజిలో)**

చిన్నపిల్లల పేజి

# నిజస్నేహితుడు

విక్కీకి తమ క్రొత్త ఇల్లు బాగా నచ్చింది. అందులోను ముఖ్యంగా ఎంతో విశాలంగా ఉన్న ఆటస్థలం నచ్చింది. ఎందుకంటే విక్కీకి ఆటలంటే మక్కువ. వెంటనే విక్కీ తనతో తెచ్చుకున్న బాల్ తీసుకొని గ్రౌండ్‌లోకి పరిగెత్తాడు.

క్రొత్త ప్రదేశం కావడంతో విక్కీతో ఆడుకోవడానికి స్నేహితులు ఎవరూ లేరు అయినా ఏమి నిరాశ చెందక వాలీబాల్ ఆడుకుంటున్న విక్కీ , నేను నీతో ఆడవచ్చా అన్న స్వరం విని వెనుదిరిగి చూశాడు. తన వయస్సున్న అబ్బాయి నిలబడి నన్ను నీతో ఆడనివ్వవూ ప్లీజ్ అని బ్రతిమాలుతున్నాడు.

ఆ అబ్బాయి ఎవరో విక్కీకి తెలియదు. ఎవరు నువ్వు? అన్నట్లు తలాడించాడు విక్కీ. తన పేరు వినయ్ అని, విక్కీ వాళ్ళింట్లో పనిచేసే వంటమనిషి కొడుకునని పరిచయం చేసుకున్నాడు వినయ్. ఆ రోజుతో వారి స్నేహం. మెదలైంది. ఆర్థిక స్థితిగతులలో వారి మధ్య ఎంతో వ్యత్యాసం ఉన్నా వారి స్నేహానికి అవి అడ్డుకాలేదు. ఆటలంటే వారిద్దరికి ఉన్న మక్కువ వారిని కలిపింది.

వినయ్ పేరుకు తగ్గట్టే వినయంగా ఉండేవాడు. ఎవరు ఏ పని చెప్పినా చేసేవాడు. క్రమం తప్పకుండా సండే స్కూల్‌కి వెళ్ళేవాడు. అక్కడ తాను నేర్చుకున్న విషయాలు విక్కీతో పంచుకునే వాడు. ప్రతిరోజు స్కూల్‌నుండి వచ్చే విక్కీ కొరకు వినయ్ ఎదురుచూస్తే ఆదివారం మాత్రం వినయ్ కోసం విక్కీ ఎదురు చూసేవాడు.

విక్కీ స్కూల్ ఫ్రెండ్స్, ఇంట్లో వాళ్ళు వినయ్ వంటి పేదవానితో స్నేహం చేయవద్దని చెప్పినా విక్కీ వినలేదు. అందునుబట్టి వినయ్ విక్కీకి, అతని స్నేహానికి అధిక ప్రాధాన్యత ఇచ్చేవాడు. అంతేకాదు విక్కీవంటి స్నేహితున్ని కలిగి ఉన్నందుకు సంతోషించేవాడు, కాస్తంత గర్వంగా కూడా ఫీల్ అయ్యేవాడు.

ఒకరోజు విక్కీ తన కొత్త రిమోట్‌కార్‌ను తీసుకొనివచ్చి వినయ్‌కు చూపిస్తూ – ఇదొక హైయండ్ ట్రాన్సాఫామబుల్ పవర్‌రేంజర్ కార్. ఈ కార్ కొరకు దాదాపు 2సం॥ల నుండి ఎదురు చూస్తున్నాను. ఫైనల్‌గా ఇప్పుడు ఇది నాకు సొంత మైంది అంటూ ఆ కార్‌ను రిమోట్‌తో ఆపరేట్ చేయ సాగాడు. ఆ కార్ అత్యంత వేగంగా వెళ్ళడమే కాక అడ్డకులను తప్పించుకుంటూ వెళ్తుంది. అటువంటి కార్‌ను చూడడం, దాని గురించి వినడం వినయ్‌కి అదే మొదటిసారి. వినయ్ కళ్ళల్లో ఆశ్చర్యం ఆ విషయాన్ని స్పష్టం చేస్తుంది. ఇంతలో వినయ్ కళ్ళు ఆశ్చర్యంతో మరింత పెద్దవైనాయి. ఆ కారు ఆటోమెటిక్‌గా తన రూపాన్ని మార్చుకొని కాళ్ళు చేతులుగల బొమ్మలాగా మారింది. వినయ్ తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. విక్కీ ఆనందంతో గెంతులు వేస్తున్నాడు.

తానుకూడ ఆ కార్‌తో ఆడుకోవాలనుకున్నాడు వినయ్. కాని విక్కీ ఆ కార్‌తో ఆడుకోవడంలో పూర్తిగా మునిగి పోయాడు. వినయ్ అడిగితే ఇస్తాను అంటున్నాడు కాని ఎంతసేపటికి ఇవ్వడం లేదు. అలా రెండురోజులు గడిచాయి విక్కీ ఆ కార్‌తో బిజీగా ఉండటం, వినయ్‌కి ఆ కార్‌తో ఆడుకోవడానికి అవకాశం రాలేదు. వినయ్ ఎంతో బ్రతి మాలిన తరువాత విక్కీ తన కారును వినయ్‌కి ఇవ్వడంతో వినయ్ ఆనందానికి హద్దులు లేవు. వినయ్ ఆనందం అతని కళ్ళల్లో కనిపించింది.

ఒకరోజు విక్కీ తన కారు కనిపించలేదని ఇళ్ళంత వెతకసాగాడు. అయినా కారు కనపడలేదు. చివరకి విక్కీ బాగా ఆలోచించిన మీదట ఆ కారును వినయ్ దొంగతనం చేసి ఉంటాడేమో అని వినయ్‌ని అడిగినప్పుడు వినయ్ తను ఆ కారు దొంగతనం చేయలేదని చెప్తాడు. అయితే విక్కీ ఆ కారంటే వినయ్‌కి ఎంతో ఇష్టం, పైగా అటువంటి కారు కొనే ఆర్థికస్థితి వినయ్‌కి లేదు కాబట్టి అతనే దొంగతనం చేసి ఉంటాడని నమ్మి వినయ్‌ని దూరం

పెట్టసాగాడు. వినయ్ ఎంత చెప్పిన విక్కీ వినలేదు. తనకెంతో ఇష్టమైన కారు పోగొట్టుకొనినందున విక్కీ చాలా బాధలోను, దానికి కారణం వినయ్ అని నమ్మి కోపంలోను ఉన్నాడు.

విక్కీ నుండి ఊహించని ప్రశ్నను, పరిస్థితిని ఎదుర్కొన్న వినయ్ చాలా బాధపడ్డాడు. ఏడ్చాడు. తన బెస్ట్‌ఫ్రెండ్ తనని దొంగ అనడం వినయ్‌ని చాలా బాధ కలిగించింది. విక్కీ గురించి ప్రార్థించసాగాడు.

ఊహించని విధంగా ఒక రోజు ప్రొద్దున్నే వినయ్ విక్కీ ఇంటి బయట నిలబడి ఉన్నాడు. ఆశ్చర్యం కలిగినా ఆనందంతో విక్కీని కౌగిలించుకున్నాడు వినయ్. విక్కీ చేతిలో ఆ టాయ్ కారు ఉంది. వెంటనే ప్రశ్నార్థకంగా విక్కీ వంక చూశాడు వినయ్.

తన పెంపుడు కుక్క ఒక ఆట వస్తువును పెరటివైపు తీసుకెళ్ళడం గమనించి దానిని అనుసరించిన విక్కీకి పెరట్లో ఒక మూలన తన పాత ఆట వస్తువులతో పాటు ఈ కారు కూడ కనపడడంతో తన తప్పు తెలుసుకున్న వాడై క్షమాపణ అడగడానికి వినయ్ వద్దకు వచ్చాడు.

క్షమాపణ అడిగన విక్కీతో వినయ్ నా ఆర్థిక స్థితి గతులను బట్టి నేను దొంగతనం చేసుంటానని నీవను కున్నావు. అప్పుడు నాకు చాలా బాధేసింది "మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు కాని యెహోవా హృదయ మును లక్ష్యపెట్టును" అని బైబిల్లో వ్రాయబడి ఉంది. ఆయన ఒక్కడే నిజమైన స్నేహితుడని తెలుసుకున్నాను. దేవున్ని బట్టి నేను ఆనందించాను. అనుదినం ప్రార్థించాను. దేవుడు జవాబిచ్చాడు అన్నాడు. విక్కీ తల వంచుకున్నాడు.

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లాపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**


## సండేస్కూల్ మెటీరియల్

| | |
|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-3 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-4 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-2 | రూ. 35/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-3 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-4 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-3 | రూ. 50/- |
| మార్గము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/- |
| ఆత్మఫలము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| బైబిల్‌బాలలు-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| ధన్యతలు-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. 20/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. 20/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. 60/- |
| సండేస్కూల్ డైరి | రూ. 75/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-1 | రూ. 35/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-2 | రూ. 40/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. 60/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. 40/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. 10/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. 160/- |
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. 300/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. 250/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. 120/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. 300/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. 300/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. 450/- |

**బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**
ఫోన్ : 9440217726



# బైబిల్ క్విజ్-08

## ద్వితీయో. 23-34 యెహోషువ 1-13



1. ఐగుప్తీయునికి పుట్టిన పిల్లలలో ఏ తరమువారు సమాజములో చేరవచ్చును?(ద్వితీ. 23)
2. ఏ పండ్లను కోయునప్పుడు పరిగెను తండ్రిలేని వారికి, విధవరాండ్రకు వదలవలెను?(24అ)
3. ఆకాశము క్రింద నుండి వారి పేరు తుడిచివేయ వలెనని చెప్పిన ఇశ్రాయేలీయుల యొక్క శత్రువులు ఎవరు?(25అ)
4. ఇశ్రాయేలీయులు దశమ భాగమును ఎప్పుడు ఇయ్యవలెను?(26అ)
5. ఏ రాళ్ళతో దేవుడైన యెహోవాకు బలిపీఠము కట్టవలెను?(27అ)
6. ఈ గ్రంథంలో 50 వచనాల కంటే ఎక్కువ ఉన్న అధ్యాయాలు ఎన్ని ఉన్నాయి?
7. హెష్బోను రాజు ఎవరు?(29అ)
8. దేవుడు వేటిని మన యెదుట ఉంచి భూమ్యాకా శములను సాక్షులుగా పిలుచుచున్నాడు? (30అ)
9. చనిపోకముందు మోషేకు దేవుడు ఎక్కడ ఎలా కనిపించెను?(31అ)
10. మోషే ఎక్కడ దేవుని మీద తిరుగుబాటు చేసెను? (32అ)
11. ద్వితీయోదేశకాండములో చిన్న అధ్యాయిు ఏది?
12. ఏ దేశములో మోషే మృతి చెందెను? (34అ)
13. యెహోషువ తండ్రి పేరు ఏమిటి? (యెహో. 1అ)
14. కనాను దేశమును వేగు చూచుటకు యెహోషువ వేగులను ఎక్కడ నుండి పంపెను?(2అ)
15. మోయుచున్న మందసమునకు ఇశ్రాయేలీయులు ఎంత దూరముగా ఉండాలి?(3అ)
16. యొర్దానులో నుండి ఎన్ని రాళ్ళను తెచ్చెను. యెహోషువ వాటిని ఎక్కడ నిలువబెట్టించెను? (4అ)
17. పస్కాపండుగను ఎక్కడ, ఎప్పుడు ఆచరించిరి?(5అ)
18. 7 దినములలో మొత్తం ఎన్నిసార్లు పట్టణము చుట్టూ తిరిగెను?(6అ)
19. ఆకాను తండ్రి పేరు ఏమిటి?(7అ)
20. ఇశ్రాయేలీయులు ఎంతమంది హాయి ప్రజలను చంపెను?(8అ)
21. యెహోషువతో సమాధాన నిబంధన చేసికొనిన వారి పట్టణములు ఏవి?(9అ)
22. ఏ అద్భుత కార్యము చేయుట ద్వారా యెహోవా శత్రువులను చంపెను? (10అ)
23. ఆ అధ్యాయంలో పేర్కొనబడిన కొండల పేర్లేమి? (11అ)
24. బాషాను రాజు పేరేమిటి? (12అ)
25. లేవీయులకు స్వాస్థ్యము ఏమిటి? (13అ)

### బైబిల్ క్విజ్ - 07జవాబులు

1.కెమూయేలు (సంఖ్యా. 34:24) 2.ప్రధానయాజకుడు మృతినొందువరకు(35:25) 3.మహలా,తిర్సా, హొగ్లా, మిల్కా,నోయా (36:11) 4.కాదేషులో (ద్వితీ. 1:46) 5. ఆరు దేశము (2:9) 6.9మూరల పొడవు, 4మూరల వెడల్పు (3:11) 7. 3 (4:42) 8. నరహత్య చేయకూడదు (5:17) 9.మస్సాలో (6:16) 10. వేయి (7:9) 11. యెహోవా సెలవిచ్చిన ప్రతిమాట వలన నరులు బ్రదుకుదురని తెలియజేయుటకు (8:3) 12.దేవుడు (9:10) 13. మోసేరు(10:6) 14.ఏబాలు (11:29) 15.రక్తము (12:23) 16. రాళ్ళతో చావగొట్టవలెను (13:7-10) 17.3(14:28) 18.7సంIIలకు (15:12) 19. రాత్రివేళ (16:1) 20.యెహోవా ఏర్పరచువానిని (17:14) 21. లేవీయులు (18:1) 22.ఇద్దరు ముగ్గురు (19:15) 23. చెట్లు (20:19) 24. రాళ్ళతో చావగొట్టుట (21:20,21) 25.గొఱ్ఱె, గాడిద,యెద్దు (22:1,3,4)